




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 205 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 31 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :205 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 31 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్

- తన వద్ద రూ.2 లక్షలు, భార్య వద్ద రూ.1 లక్ష నగదు రూపంలో ఉన్నట్లు వెల్లడి
- బీఎండబ్ల్యూ, టయోటా కార్లు ఉన్నట్లు తెలిపిన విజయ్
- రూ.1.20 కోట్ల విలువైన బంగారం ఉందని పేర్కొన్న విజయ్

- మిగతా2లో




## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు, రికార్డు చేయవు

- వస్తువులను చూడటం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన అవుతుందన్న మంత్రి
- లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు వెల్లడి
- లాకర్లలోని వస్తువులను విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం కుదరదని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:వినియోగదారులు లాకర్లలో ఉంచే విలువైన వస్తువులను బ్యాంకులు చూడలేవని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వాటిని చూడటం లేదా రికార్డు చేయడం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. బ్యాంకు లాకర్లలో

- మిగతా2లో



## కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారింది



- సన్నకారు రైతులను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందన్న పేర్ని నాని
- బోరు వేయాలన్నా రూ. 50 వేలు వసూలు చేస్తున్నారని ఆరోపణ
- బాధితుల పక్షాన పోరాడతామని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సన్నకారు రైతులను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందని

- మిగతా2లో

## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

- తిరుమలలో కాస్త తగ్గిన భక్తుల తాకిడి
- శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం
- 10 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న 80,774 మంది
- రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం



- మిగతా2లో

## పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- టీడీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్
- సోషల్ మీడియా ద్వారా స్పందించిన చంద్రబాబు
- కూటమి ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్న సీఎం
- గత 20 నెలల పాలనే మన ఐక్యతకు నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ఐక్యతా స్ఫూర్తి పదికాలాలు కొనసాగాలని ఆకాంక్ష



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ., "రాష్ట్ర అభివృద్ధి,

- మిగతా2లో



## తిరుపతిలో వెయ్యి కోట్ల భూదందా..

### సూత్రధారి, పాత్రధారి నారా లోకేశ్

- తిరుపతి నడిబొడ్డున ఉన్న 22 ఎకరాల భూమిని రూ. 94 కోట్లకే అప్పగించారన్న భూమన
- బహిరంగ ప్రకటన కూడా లేకుండానే భూమిని దోచిపెట్టారని మండిపాటు
- వందల కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:తిరుపతిలో సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కూటమి ప్రభుత్వం కారుచౌకగా ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతోందని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారానికి మంత్రి నారా లోకేశ్ సూత్రధారి,

- మిగతా2లో

# డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం

- నాయుడుపేటలో ఇళ్ల పంపిణీ... ఓ ఇంటికి గుమ్మడికాయ కట్టిన సీఎం చంద్రబాబు...
- రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం
- నాయుడుపేటలో లబ్ధిదారులతో కలిసి ఇళ్లలోకి ప్రవేశించిన సీఎం చంద్రబాబు
- హిందూ లబ్ధిదారు ఇంటిలో సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ముస్లిం కుటుంబంతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన చంద్రబాబు
- కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు పాల్గొన్నారు







పెన్ పవర్ డెస్క్:రాష్ట్రవ్యాప్తంగా పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన 2.5 లక్షల టిడ్కో ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం సోమవారం పండుగ వాతావరణంలో జరిగింది. తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొని ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన లబ్ధిదారులతో కలిసి వారి కొత్త ఇళ్లలోకి ప్రవేశించి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి, లబ్ధిదారురాలైన ముక్కర అంబిక ఇంటికి వెళ్లి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి వ్రతంలో కూర్చుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం, మరో లబ్ధిదారురాలైన షేక్ నూరి ఇంటికి వెళ్లారు. అక్కడ వారి సంప్రదాయం ప్రకారం జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. నూరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారిని ఆశీర్వదించారు. ఒకే వేదికపై హిందూ, ముస్లిం లబ్ధిదారుల ఇళ్లలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొనడం

- మిగతా2లో

## ఏపీ పోలీసుల ముందు లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

- పోలీసుల ముందు లొంగిపోయిన మావో నేత చెల్లూరు నారాయణరావు అలియాస్ సోమన్న
- ఏవోబీ ప్రాంతంలో దశాబ్దాల పాటు ఆయనది కీలక పాత్ర
- మావోయిస్టుల లొంగుబాటుకు రేపటితో ముగుస్తున్న డెడ్ లైన్

పెన్ పవర్ డెస్క్: దేశవ్యాప్తంగా మావోయిజం నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న వేళ, మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆంధ్రా-ఒడిశా బోర్డర్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, పార్టీలో కీలక వ్యూహకర్తగా ఉన్న చెల్లూరు నారాయణరావు

- మిగతా2లో



## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది: కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

- కేరళ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు
- పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశంపై మోదీ ఎందుకు మాట్లాడలేదన్న రాహుల్
- అవినీతి ఆరోపణలు ఉన్న విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్న

- మిగతా2లో




## హర్మూజ్ తెరవకపోతే ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

### ఇరాన్ కు ట్రంప్ తాజా వార్నింగ్

- హర్మూజ్ జలసంధిని తెరవకపోతే తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- ఖర్గ్ దీవి సహా కీలక చమురు, విద్యుత్ కేంద్రాలను ధ్వంసం చేస్తామని అల్టిమేటం
- చర్చల్లో పురోగతి ఉందని చెబుతున్న ట్రంప్.. అలాంటివేమీ లేవంటున్న ఇరాన్
- మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక మోహరింపుతో పెరుగుతున్న ఉద్రిక్తతలు

- మిగతా2లో



## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్.. రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- దేశవ్యాప్తంగా మరో 11 విమానాశ్రయాల్లో ఉడాన్ యాత్రి కేఫ్‌లు ప్రారంభం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా వర్చువల్ ప్రారంభోత్సవం
- ఈ కేఫ్‌లలో రూ.10కే టీ, వాటర్ బాటిల్, రూ.20కే స్నాక్స్
- స్థానిక రుచులకు ప్రాధాన్యత.. ప్రయాణికుల నుంచి ప్రశంసలు



పెన్ పవర్ డెస్క్:విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# దక్షిణ భారతంపై ఢిల్లీ పెత్తనం

భారతదేశం అనేది రాష్ట్రాల కలయికతో ఏర్పడిన ఒక సమాఖ్య. కానీ, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి ఆ సమాఖ్య పునాదులను పెకిలించి, దేశాన్ని ఒకే రంగు, ఒకే భాష, ఒకే అధికార కేంద్రం కిందకు తెచ్చేందుకు ప్రమాదకరమైన వ్యూహాలను అమలు చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల లేవనెత్తిన అంశాలు కేవలం రాజకీయ విమర్శలు కావు; అవి దక్షిణాది అస్తిత్వంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా వినిపించిన హెచ్చరికలు. ఆర్థికంగా దోపిడీ చేస్తూ, రాజకీయంగా గొంతు నొక్కే ఈ 'నయా సామ్రాజ్యవాద' ధోరణిని దక్షిణాదిలోని ప్రజాస్వామిక, లౌకిక శక్తులు ఐక్యంగా ఎదిరించాల్సిన చారిత్రక అవసరం ఏర్పడింది. దక్షిణాది రాష్ట్రాలు-తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ-దేశ అభ్యున్నతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దేశ భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 20 శాతం, జనాభాలో 19 శాతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు, దేశ జీడీపీలో ఏకంగా 30 శాతం పైగా వాటాను అందిస్తున్నాయి. అయితే, కేంద్ర పన్నుల పంపిణీలో మనకు జరుగుతున్న అన్యాయం విస్మయానికి గురి చేస్తోంది.

కర్ణాటక కేంద్రానికి రూపాయి పన్ను చెల్లిస్తే, తిరిగి పొందుతున్నది కేవలం 15 పైసలు మాత్రమే. తమిళనాడు చెల్లించే ప్రతి రూపాయికి 29 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయి. తెలంగాణ రూపాయికి దాదాపు 40 పైసల లోపే వాటా దక్కుతోంది. ఉత్తరప్రదేశ్, బీహార్ దీనికి భిన్నంగా, ఉత్తరప్రదేశ్ ఒక రూపాయి చెల్లిస్తే దాదాపు 2.70 రూపాయలు, బీహార్ ఏకంగా 7 రూపాయలకు పైగా తిరిగి పొందుతున్నాయి. అభివృద్ధి చెందినందుకు, జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు శిక్ష వేయడం ఏ రకమైన న్యాయం దక్షిణాది కార్మికుల చెమట, ఐటీ నిపుణుల మేధస్సుతో వస్తున్న సంపదను ఉత్తరాదిలోని బీజేపీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి మళ్లించడం ఒక రకమైన 'ఆర్థిక వలసవాదం' కాక మరేమిటి? 2026 తర్వాత జరగబోయే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాజకీయ అస్తిత్వాన్ని నాశనం చేసేలా ఉంది. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గుతుంది లేదా స్థిరంగా ఉంటుంది. అదే సమయంలో, జనాభా విస్ఫోటనం జరిగిన హిందీ రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరుగుతుంది. దీనివల్ల ఢిల్లీ పీఠాన్ని అధిరోహించడానికి దక్షిణాది మద్దతు అవసరం లేని పరిస్థితి ఏర్పడుతుంది. పార్లమెంటులో దక్షిణాది గళం బలహీనపడి, మన ప్రాంతీయ ప్రయోజనాలు పూర్తిగా విస్మరించబడతాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. బాధ్యతాయుతంగా వ్యవహరించిన రాష్ట్రాలను శిక్షించి, బాధ్యతారాహిత్యంగా ఉన్న ప్రాంతాలకు రాజకీయ అధికారం కట్టబెట్టడం 'ఆర్ఎస్ఎస్' మార్క్ అఖండ భారత వ్యూహంలో భాగం.

బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి కేవలం నిధులను మాత్రమే దోచుకోవడం లేదు; మన సంస్కృతిని, భాషను కూడా అణగదొక్కాలని చూస్తోంది. 'హిందీ-హిందూ-హిందుస్థాన్' అనే నినాదంతో దక్షిణాదిలోని విభిన్న భాషా అస్తిత్వాలను తుడిచివేయాలని చూస్తున్నారు. కేరళలో లౌకికవాదాన్ని, తమిళనాడులో ద్రవిడ ఆత్మగౌరవాన్ని, తెలుగు రాష్ట్రాల్లోని ప్రజాస్వామిక సంస్కృతిని విచ్ఛిన్నం చేసేందుకు మతపరమైన చిచ్చు పెడుతున్నారు. దక్షిణాదిలోని కేరళ, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాలు నేటికీ సెక్యులర్ విలువలకి కంచుకోటలు. అందుకే ఈ రాష్ట్రాలపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి లేవనెత్తిన నిధుల అంశం, స్టాలిన్ వినిపిస్తున్న భాషా హక్కుల గళం, పినరయి విజయన్ సాగిస్తున్న ఫెడరలిజం పోరాటం.. ఇవన్నీ ఇప్పుడు ఒకే వేదికపైకి రావాలి. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి దక్షిణాది ముఖ్యమంత్రులందరూ ఒకే గొంతుతో ఢిల్లీని నిలదీయాలి. ఇది కేవలం పాలకుల పోరాటం కాకూడదు. దక్షిణాదిలోని ప్రతి పౌరుడికి ఈ అన్యాయం గురించి తెలియాలి. మా నిధులు మాకే - మా హక్కులు మాకే అనే నినాదం మార్మోగాలి. కార్పొరేట్ శక్తులకు దేశ వనరులను కట్టబెడుతూ, రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి దక్షిణాది నుంచే అసలైన ప్రతిఘటన మొదలవ్వాలి. లెఫ్ట్, డెమోక్రటిక్, సెక్యులర్ శక్తులు ప్రజలను ఆర్గనైజ్ చేసి, ఒక భారీ 'సౌత్ ఇండియా ర్యాలీ' ద్వారా తమ సత్తా చాటాలి. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి దేశానికి గర్వకారణం కావాలి కానీ, అది మన బలహీనత కాకూడదు. ఢిల్లీ పీఠం దక్షిణాదిని శాసించడం కాదు, దక్షిణాది ప్రజాస్వామిక గళం ఢిల్లీని నియంత్రించే రోజు రావాలి. అది మన ఆత్మగౌరవ పోరాటం!

# ఏపీ పోలీసుల ముందు లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

- మొదటి పేజీ తరువాయి
అలియాస్ సోమన్న ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ పరిణామం ఏవోబీ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికిని దాదాపు లేకుండా చేసినట్లయ్యిందని భద్రతా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నారాయణరావు ప్రస్థానం పీపుల్స్ వార్ కాలం నుంచే ప్రారంభమైంది. పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పలు కీలక హోదాల్లో పనిచేశారు. ఏవోబీ ప్రాంతంలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంలో, రిక్రూట్‌మెంట్లు చేపట్టడంలో ఆయనది కీలక పాత్ర. అటవీ ప్రాంతంలో దశాబ్దాల కాలం పాటు గెరిల్లా పోరాటంలో ఆరితేరిన సోమన్న లొంగుబాటును ఏపీ డీజీపీ త్వరలోనే అధికారికంగా ధ్రువీకరించనున్నారు.గత ఏడాది కాలంగా ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దుల్లో భద్రతా బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ కగార్' మావోయిస్టుల కోటలను బద్దలు కొట్టింది. ముఖ్యంగా, 2026 మార్చి 31 (రేపు) నాటికి దేశంలో మావోయిజాన్ని పూర్తిగా అంతం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్దేశించిన లక్ష్యం దిశగా బలగాలు దూసుకుపోతున్నాయి. ఈ గడువు ముగియడానికి కేవలం కొన్ని గంటల ముందే అత్యంత కీలక నేత సోమన్న లొంగిపోవడం గమనార్హం.

# రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్

రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులను రూ.404.58 కోట్లుగా చూపించారు. అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తులు మొత్తం రూ. 4,04,58,57,196గా ఉంది. బ్యాంకు డిపాజిట్లు, పెట్టుబడులు, వాహనాలు, ఇతర చరాస్తులతో సహా ఆయన ఆర్థిక వివరాలను ఈ అఫిడవిట్‌లో వివరంగా పొందుపరిచారు. తన వద్ద నగదు రూపంలో రూ.2 లక్షలు, భార్య సంగీత వద్ద రూ.1 లక్ష ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్, ఫిక్స్ డిపాజిట్ల రూపంలో రూ.388 కోట్లు ఉన్నట్లు తెలిపారు. తన వద్ద బీఎండబ్ల్యూ 530, బీఎండబ్ల్యూ ఐ7, టయోటా లెక్సస్ 350, టయోటా వెల్‌ఫైర్ వంటి ఖరీదైన కార్లతో పాటు ఇతర ఆటోమొబైల్స్, ద్విచక్ర వాహనాలు కూడా ఉన్నాయని పొందుపరిచారు. వాహనాల మొత్తం విలువ రూ.14.35 కోట్లుగా పేర్కొన్నారు.

తన వద్ద 883 గ్రాముల బంగారం, దాని విలువ రూ.1.20 కోట్లు ఉంటుందని వెల్లడించారు. రూ.15 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు వెల్లడించారు. తనవద్ద ఉన్న స్థిరాస్తుల్లో తాను కొన్నవాటితో పాటు, వారసత్వంగా వచ్చినవి కూడా ఉన్నాయని వెల్లడించారు. స్వయం ఉపాధి, వడ్డీ, ఆస్తుల నుంచి వచ్చే అద్దె తన ప్రధాన ఆదాయవనరు అని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 184.53 కోట్ల ఆదాయం ఆర్జించినట్లు విజయ్ పేర్కొన్నారు.

# తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

తిరుమల కొండపై భక్తుల రద్దీ కాస్త తగ్గింది. సోమవారం కావడంతో భక్తుల తాకిడి సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. ప్రస్తుతం 10 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు.నిన్న ఆదివారం (మార్చి 29) నాడు మొత్తం 80,774 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 27,447 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆదివారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది.

సాధారణంగా వారాంతాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండి, కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోతుంటాయి. అయితే, వారాంతం ముగియడంతో ప్రస్తుతం రద్దీ కాస్త అదుపులో ఉంది. భక్తులు తక్కువ సమయంలోనే దర్శనం చేసుకుంటున్నారు.

## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది:

# కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయ విమర్శల పదును పెంచారు. రాష్ట్రంలో అధికార ఎల్డీఎఫ్ (వామపక్ష కూటమి) - కేంద్రంలోని బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పత్తనంతిట్ట జిల్లా అడూర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ... కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేవలం వామపక్షాలతోనే కాకుండా, 'ఎల్డీఎఫ్-బీజేపీ' కూటమితో కూడా పోరాడుతోందని అన్నారు.పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల ఆలయ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదని రాహుల్ ప్రశ్నించారు. ఆలయ బంగారాన్ని కాజేశారన్న ఆరోపణలపై ప్రధాని మౌనం వహించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందన్నారు. కేవలం ఓట్ల కోసమే మోదీకి గుడులు, మతం గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు.కేంద్ర దర్యాప్తు సంస్థలు కేవలం తన వంటి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, 36 కేసులు పెట్టి 55 గంటల పాటు విచారించాయని రాహుల్ గుర్తు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం పినరయి విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. విజయన్ అవినీతి మరకల వల్లే మోదీ గుప్పిట్లో ఉన్నారని, అందుకే వామపక్ష ప్రభుత్వం 'కార్పొరేట్ నిధుల ప్రభుత్వం'గా మారిందని విమర్శించారు.

# హర్మూజ్ తెరవకపోతే ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని, లేనిపక్షంలో ఇరాన్‌లోని ఖర్గ్ దీవితో సహా కీలకమైన చమురు బావులు, విద్యుత్ కేంద్రాలను పేల్చివేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్తతలను పెంచింది.

ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్, ఇరాన్‌లోని కొత్త నాయకత్వంతో చర్చలు జరుపుతున్నామని, వాటిలో గణనీయమైన పురోగతి ఉందని తెలిపారు. అయితే, ఒప్పందం త్వరగా కుదరకపోయినా లేదా హర్మూజ్ జలసంధిని తెరవకపోయినా తీవ్ర చర్యలు తప్పవన్నారు. ఇరాన్‌లోని చమురు బావులు, విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు, ఇతర కీలక సౌకర్యాలను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు ఉద్దేశపూర్వకంగా వదిలేసిన మంచినీటి డీశాలినేషన్ ప్లాంట్లను కూడా లక్ష్యంగా చేసుకునే అవకాశాలున్నాయని సంకేతాలిచ్చారు. గత 47 ఏళ్ల ఇరాన్ పాలనలో మరణించిన అమెరికా సైనికులకు ప్రతీకారంగానే ఈ చర్యలు ఉంటాయని ట్రంప్ స్పష్టం చేశారు.ఒకవైపు చర్చల్లో పురోగతి ఉందని ట్రంప్ చెబుతున్నప్పటికీ, మరోవైపు అమెరికా ఆ ప్రాంతంలో అదనపు సైన్యాన్ని మోహరిస్తోంది. దీనిపై ఇరాన్ పార్లమెంట్ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చర్చల పేరుతో అమెరికా దండయాత్రకు సిద్ధమవుతోందని వారు ఆరోపించారు. అయితే, అమెరికాతో ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగడం లేదని

ఇరాన్ నాయకులు ఖండించారు.

ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ సైనిక శక్తులు ఇటీవల నౌకాయానానికి దాదాపు మూసివేశాయి. గతంలో ఇరాన్ ఇంధన కేంద్రాలపై దాడులను 10 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించగా, ఆ గడువు ఏప్రిల్ 6తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు ప్రపంచ చమురు మార్కెట్లపై, మధ్యప్రాచ్య భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి.

# ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్.. రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- మొదటి పేజీ తరువాయి
ఏర్పాటు చేసిన "ఉడాన్ యాత్రి కేఫ్"ల సేవలను మరింత విస్తరించింది. తాజాగా దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేఫ్‌లలో టీ, కాఫీ, సమోసా, వాటర్ బాటిల్ వంటివి కేవలం రూ.10 నుంచే లభించనున్నాయి.రాజ్‌కోట్ విమానాశ్రయం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ కేఫ్‌లతో పాటు దేశవ్యాప్తంగా 57 విమానాశ్రయాల్లో ప్రయాణికులకు ఉపయోగపడే పలు ఇతర సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్‌లలో లక్నో, పాట్నా, రాజ్‌కోట్, జమ్మూ, శ్రీనగర్, జైపూర్, ఇండోర్ వంటి కీలక విమానాశ్రయాలు ఉన్నాయి. వీటితో పాటు డిజి యాత్ర, ఉచిత వైఫై సేవలు, ప్రయాణికుల కోసం ఉచిత గ్రంథాలయం 'ఫ్లైబ్రరీ', పిల్లల కోసం ప్రత్యేకంగా 'కిడ్స్ జోన్' వంటి సౌకర్యాలను కూడా ప్రారంభించారు. స్థానిక స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 'అవ్సార్' (ఆూఆూూ=) ఔట్‌లెట్లను కూడా తెరిచారు.

### అందుబాటు ధరలు.. స్థానిక రుచులు

ఈ ఉడాన్ యాత్రి కేఫ్‌లలో ధరలు చాలా అందుబాటులో ఉంటాయి. సాధారణంగా టీ రూ.10, వాటర్ బాటిల్ రూ.10, కాఫీ రూ.20, స్నాక్ రూ.20, స్వీట్ ఆఫ్ ది డే రూ.20కి లభిస్తుంది. ఈ కేఫ్‌ల మెనూలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాల

స్థానిక రుచులకు ప్రాధాన్యత ఇవ్వడం. ఉదాహరణకు పుణె ఎయిర్‌పోర్టులో వడా పావ్, చెన్నైలో వడై, కోయంబత్తూరులో మెధు వడ వంటివి అందిస్తున్నారు. అయితే, దాదాపు అన్ని కేఫ్‌లలో సమోసా కామన్‌గా లభిస్తోంది.

ఇప్పటికే కోల్‌కతా, చెన్నై, పుణె, విజయవాడ, ఇటానగర్, భువనేశ్వర్, సూరత్, అహ్మదాబాద్, ముంబై, మంగళూరు, తిరువనంతపురం, కోయంబత్తూరు విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి. తాజాగా మరో 11 చోట్ల వీటిని ప్రారంభించడంతో ప్రయాణికులపై భారం తగ్గనుంది.

# డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం

- మొదటి పేజీ తరువాయి
మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కొలుసు పార్థసారధి, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీ, పలువురు ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు, రికార్డు చేయవు

- మొదటి పేజీ తరువాయి
భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ అంశంపై ఆమె మాట్లాడారు. వస్తువుల ఆధారంగా బీమా కవరేజీ ఉంటుందనే వాదనను ఆమె తోసిపుచ్చారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయని అన్నారు. లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కానీ లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీ చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని స్పష్టం చేశారు.

## పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి
ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు మీరు అందిస్తున్న సహకారం అభినందనీయం. నాకున్న అనుభవానికి తోడుగా, ఉత్తమ ఆకాంక్షలు, ఆదర్శాలు కలిగిన మీ వంటి ప్రజానేతలు కలిసివస్తే రాష్ట్రానికి, దేశానికి ఎంతటి మేలు జరుగుతుందో గత 20 నెలల పాలన ఒక నిదర్శనం" అని పవన్ కల్యాణ్ ను ఉద్దేశించి పేర్కొన్నారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడిన తమ కూటమి ఐక్యతా స్ఫూర్తి ఇలాగే పదికాలాల పాటు కొనసాగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో పవన్ కల్యాణ్ వంటి నేతల పాత్ర కీలకమని, ఆయన తోడ్పాటుతో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకువెళతామని చంద్రబాబు తన సందేశంలో స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఉన్న సమన్వయం రాష్ట్రానికి శుభపరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు.

## కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారింది


- మొదటి పేజీ తరువాయి
మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. మచిలీపట్నంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసిన ఆయన... ఆర్డీవో, ఎమ్మార్వోలపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారిందని నాని ఆరోపించారు. "వందల ఎకరాలు ఉన్న బడా రైతులకు రెడ్ కార్పెట్ పరుస్తున్న అధికారులు... ఎకరం, అర ఎకరం ఉన్న చిన్న రైతులను మాత్రం పట్టిపీడిస్తున్నారు. చెరువు రిపేరు చేయాలన్నా రూ. 50 వేలు, బోరు వేయాలన్నా మరో రూ. 50 వేలు వసూలు చేస్తూ వికృత సంస్కృతికి తెరలేపారు" అని ధ్వజమెత్తారు.పెదపట్నం, కానూరు గ్రామాల్లో మడ అడవులను యథేచ్ఛగా నరికి చెరువులు తవ్వుతుంటే పట్టించుకోని అధికారులు, కోన గ్రామంలోని ఓ చిన్న రైతును రికార్డుల పేరుతో వేధించడం దారుణమన్నారు. 83 సెంట్ల భూమి ఉన్న రైతును ఆర్డీవో సాంబశివరావు నానా హైరానా పెట్టి, చెరువును పూడ్చాలని ఆదేశించడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు. ముడుపుల మాయలో పడి చిన్న రైతుల పొట్ట కొట్టాలని చూస్తే సహించేది లేదని, బాధితుల పక్షాన పోరాడతామని పేర్ని నాని హెచ్చరించారు.

## తిరుపతిలో వెయ్యి కోట్ల భూదందా..

- మొదటి పేజీ తరువాయి
పాత్రధారి అని ఆయన ఆరోపించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ ఆరోపణలు గుప్పించారు. తిరుపతి నడిబొడ్డున ఉన్న 22 ఎకరాల విలువైన భూమిని కేవలం 94 కోట్ల రూపాయలకే రెండు రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించారని భూమన ఆరోపించారు. "దివ్యశ్రీ రియల్ ఎస్టేట్ (బెంగళూరు), సైబర్ సిటీ డెవలపర్ (హైదరాబాద్) సంస్థలకు ఎటువంటి బహిరంగ ప్రకటన లేకుండానే భూములు దోచిపెట్టారు. ఈ సంస్థల్లో లోకేశ్ భాగస్వామిగా ఉన్నారా? లేక ఇవి ఆయన బినామీ సంస్థలా?" అని ప్రశ్నించారు. ఈ ఒప్పందం వెనుక సుమారు 300 నుంచి 400 కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరకు అమ్మడమే కాకుండా, సదరు సంస్థలకు అసాధారణ రాయితీలు కల్పించారని భూమన విమర్శించారు. 15 ఏళ్ల పాటు ఏపీ జీఎస్టీ ప్రోత్సాహకాలు, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్ కల్పించారని అన్నారు. ఐదేళ్ల పాటు ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. సాధారణంగా టూరిజం ప్రాజెక్టులను పీపీపీ విధానంలో ఇస్తారని, కానీ ఇక్కడ 'ఫ్రీ హోల్డ్' విధానంలో కట్టబెట్టడం వెనుక పెద్ద మతలబు ఉందని ఆరోపించారు.

ఎలాంటి అనుభవం లేని రియల్ ఎస్టేట్ సంస్థలకు వందల కోట్ల విలువైన భూములు కేటాయించడంలో ఆంతర్యమేమిటని భూమన ప్రశ్నించారు. తిరుపతి ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈ భూదందాను అడ్డుకుని తీరుతామని ఆయన హెచ్చరించారు.

# రామాలయంలో పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే కదిరి



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 30**

హనుమంతునిపాడు మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో రామాలయం నందు సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వార్ల పంచలోహ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేవస్థానం కమిటీ ఆహ్వానం మేరకు సోమవారం కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం కమిటీ సభ్యులు కదిరి బాబురావు కు స్వాగతం పలికి పూలమాలవేసి శాలువాతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో రక్షిత ఫార్మసి అధినేత చందన రామేశ్వర రావు, కదిరి రమణయ్య, గోను చంద్రశేఖర్ రెడ్డి,నందనవనం ఎంపీటీసీ సభ్యులు నారాయణ స్వామి,యం శివ,యం. రంగసాయి యాదవ్,బేతం మనీష్, తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్
## మార్కాపురం - ప్రకాశం

# కూటమి ప్రభుత్వంలో పల్లెలకు మంచిరోజులు

**పంచాయతీలకు దండిగా నిధులు**
**జోరుగా అభివృద్ధి**
**ఈ 20 నెలల్లో గ్రామాల్లో**
**ఎంతో మార్పు కనిపిస్తోంది**
**వైసిపి పాలనలో జీరో పవర్ సర్పంచులు**
**చంద్రబాబు అనుభవమే రాష్ట్రాన్ని ముందుకు**
**నడిపిస్తోంది-ఎమ్మెల్యే ఇంటూరి**

## ఆత్మకూరులో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు





**ఉలవపాడు పెన్ పవర్ మార్చి 30**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఉన్న సుదీర్ఘ అనుభవమే, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిస్తుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఉలవపాడు మండలం ఆత్మకూరు పంచాయతీలో 43.3 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఆత్మకూరులో 4 లక్షలతో నిర్మించిన రెండు సిసి రోడ్లు, 4.5 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డు, 21.8 లక్షల ఉపాధి పథకం నిధులతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు కుమ్మరిపాలెంలో 13 లక్షలతో నిర్మించిన రెండు సిసి రోడ్లను ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం లభించింది. సర్పంచ్ నాళం గోవిందమ్మ నారాయణరావు దంపతులు, పంచాయతీ సభ్యులు, టిడిపి నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్ పరిపాలనలో పంచాయతీల్లో చిన్నచిన్న పనులకు కూడా నిధులు లేని పరిస్థితిని చూశామన్నారు. పంచాయతీ ఖాతాల్లోకి నిధులు జమకాగానే దారి మళ్ళించేవారని గుర్తుచేశారు. ఐదేళ్లపాటు ఒక్క పని కూడా చేయలేక, సర్పంచులు నామమాత్రంగా మిగిలిపోయారని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం బెంగళూరులో తలదాచుకోవడం, అప్పుడప్పుడు విజయవాడ వచ్చి ప్రెస్ మీట్ లు పెట్టి ప్రభుత్వంపై బురదచల్లి వెళ్లిపోవడం తప్ప జగన్ వల్ల ఉపయోగమేమీ లేదన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీలకు విడతల వారీగా డబ్బులు ఇస్తోందని, ఈ 20 నెలల్లో పల్లెల్లో ఎంతో అభివృద్ధి కనిపించిందని నాగేశ్వరరావు తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలవలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాతో పాటు అన్ని మౌలిక వసతులు సక్రమంగా ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. చంద్రబాబు 75 సంవత్సరాల వయసులో రోజుకు 15 గంటలు ప్రజల కోసం కష్టపడుతున్నారని, మనమందరం ఆయనకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. అమరావతిని ఎవరూ కదల్చకుండా, రాజధానికి చట్టబద్ధత కల్పిస్తూ ఇటీవల అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు గుర్తుచేశారు. 33 వేల ఎకరాల భూములు ఇచ్చిన రైతులను నానా చిత్రహింసలు చేసి జగన్ విකృతానందం పొందాడని దానికి తగ్గట్టుగా ప్రజలు కూడా ప్రతిపక్ష హోదా లేకుండా చేశారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నారా లోకేష్ కష్టపడుతున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. ఆత్మకూరు గ్రామం పక్కనే ఉన్న మన్నేరు ద్వారా గతంలో ఇసుక తెచ్చుకోవాలంటే వైసీపీ నేతల పర్మిషన్ అవసరం ఉండేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఇసుక ఉచితంగా తీసుకెళ్లే అవకాశం కలిగిందని నాగేశ్వరావు అన్నారు. అనంతరం గ్రామస్తులు నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగియబోతున్న సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాళం గోవిందమ్మ, టిడిపి నేత నాళం నారాయణరావు, గ్రామ టిడిపి అధ్యక్షుడు కొల్లి అవినాష్, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహ కార్యదర్శి మద్దసాని మహేంద్ర, మాజీ సర్పంచ్ అమర్నేని రాములు, క్లస్టర్ ఇంచార్జి బెల్లం కృష్ణమోహన్, టిడిపి నేతలు బండి వెంకటసుబ్బయ్య, దేవినేని అవినాష్, కొల్లి శ్రీను, దేవినేని శ్రీనివాసులు, నాళం విజయ శేఖర్, పంచాయితీ వార్డు సభ్యులు చిడితోటి కోటేశ్వరరావు, దేవినేని శ్రీహరి, వెంకారెడ్డి, దామచర్ల రమణమ్మ, ఎండ్లూరి లాజర్, అమర్నేని శ్రీహరి, శ్రీధర్ రావు, దామచర్ల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సురేష్, వ్యవసాయ అధికారి విజయకుమార్, పలు శాఖల అధికారులు, మండలంలోని టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కంద్రా మాల్యాద్రికి అరుదైన గౌరవం

**-టిడిపికి విశిష్ట సేవలు అందించినందుకు ప్రత్యేక గుర్తింపు**


**-చంద్రబాబు, లోకేష్ చేతులమీదుగా పురస్కారం**

**కందుకూరు పెన్ పవర్ మార్చి 30**

మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుగుంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కంద్రా మాల్యాద్రికి ప్రత్యేకగుర్తింపు లభించింది. రాష్ట్రస్థాయిలో పార్టీ ఆవిర్భావం నుంచి విశిష్ట సేవలు అందించిన 44 మందిని ఎంపిక చేసి విజయవాడలో ఆదివారం జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆహ్వానించారు. వారిలో కంద్రా మాల్యాద్రికి కూడా ఒకరు. ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో మాల్యాద్రికి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహంతోపాటు మంగళగిరి చేనేత వస్త్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి నారా లోకేష్ అందజేశారు. వారిద్దరూ 44 మందితో కలిసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు. మాల్యాద్రి గతంలో మున్సిపల్ కౌన్సిలర్ గా, రెండుసార్లు పట్టణ పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా కంద్రా మాల్యాద్రి మాట్లాడుతూ పార్టీలో సీనియర్ల సేవలను గుర్తించి సత్కరించడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కి కృతజ్ఞతలు తెలిపారు.

# పి 4తో నవశకం

## పి 4 ప్రథమ వార్షికోత్సవ వేడుకలో ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 30**

గిద్దలూరు పట్టణంలోని చితిరాల కళ్యాణ్ మండటం లో కూటమి ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి 4 ప్రథమ వార్షిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "స్వర్ణాంధ్ర విజన్ 2047"లో భాగంగా పాలసీ పబ్లిక్ ,ప్రయివేట్ పీపుల్ పార్టనర్ షిప్ ను ప్రవేశ పెట్టిందన్నారు. పి 4 పాలసీ యొక్క ముఖ్య భావన ఏమిటంటే, సంప్రదాయ మోడల్ను విస్తరించి, అందులో "ప్రజలను" కీలక భాగస్వాములుగా చేర్చడం. ఈ విధంగా ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, ప్రజలు కలిసి అభివృద్ధి ప్రక్రియలో భాగస్వామ్యం అవుతారన్నారు. ఈ పి4 కార్యక్రమం నందు లబ్దిదారులను బంగారు కుటుంబాలు"గా, మెంటర్లను మార్గదర్శకులు" గా పిలుస్తారన్నారు. ఈవిధానం సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారిస్తుందన్నారు. ఉపాధి మరియు జీవనోపాధి అవకాశాలు విద్య మరియు ఆరోగ్య సేవలు నైపుణ్యాభివృద్ధి వ్యాపారావకాశాలు సామాజిక భద్రత , మౌలిక సదుపాయాల మెరుగుదల లాంటివి ఉంటాయన్నారు. ప్రథమ దశలో ఈ కార్యక్రమం ద్వారా సుమారు 20 లక్షల కుటుంబాలను చేర్చుకోవడం లక్ష్యంగా ఉందన్నారు. ఇందులో వ్యక్తులు, సంస్థలు, ఎన్జీఓలు, ప్రవాస భారతీయులు కూడా భాగస్వాములు అవుతున్నారన్నారు. మనం కలిసి జరుపుకుంటున్న పి4 వార్షికోత్సవం ఒక సాధారణ కార్యక్రమం మాత్రమే కాదని -- ఇది మన అందరి కృషి, అంకితభావం,సాధించిన విజయాల ప్రతీకఅన్నారు గత సంవత్సరంలో మనం ఎదుర్కొన్న సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, ఎన్నో విజయాలను సాధించామన్నారు పి 4 కార్యక్రమం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతూ, సమాజానికి ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా అమలు చేసిందన్నారు. విద్య, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధి రంగాల్లో మార్గదర్శుల సహకారంతో గొప్ప ఫలితాలు సాధించగలిగామన్నారు. విజయానికి కారణం ఒక్కరే కాదు ఇది ఒక సమిష్టి కృషి అన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములైన అందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. పాలసీ పేదరిక నిర్మూలనను ఒక ప్రజా ఉద్యమంగా మార్చే వినూత్న విధానంగా నిలుస్తుందన్నారు. ఇది సమాన అభివృద్ధి, సామాజిక సమగ్రత, చివరి వ్యక్తి వరకు లాభాలు చేరేలా చేయడం లక్ష్యంగా పెట్టుకొని రూపొందించబడిందిన్నారు. రానున్న రోజుల్లో కూడా మనం ఇంకా గొప్ప లక్ష్యాలను సాధించాలన్నారు. కొత్త ఆలోచనలు, నూతన కార్యక్రమాలతో సమాజానికి మరింత సేవ చేయాలని. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలన్నారు ఈ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన గిద్దలూరు యంగ్ ప్రొఫెషనల్ " షేక్.బెపరి మహమ్మద్ ఫోజాన్ ,దూదేకుల ఖాసిం వలి , షేక్.నాయబ్ రసూల్, బి. మాధవీ లత, ఎన్ శైలజ , జి శ్రీలత " ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలుతెలిపారు. మనందరం కలిసికట్టుగా పనిచేస్తూ పి4ను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాన్నారు. అనంతరం పి 4 పాలసీ ద్వారా ముందుకు వచ్చి వికలాంగులకు ఉచితంగా పరికరాలు అందించిన కేశవ మూర్తి, 2 నీరు పేద కుటుంబాలని దత్తత తీసుకున్న ఎమ్మార్వో రఫీ ని ఎమ్మెల్యే శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ తహసీల్దార్ లు, ఎంపిడిఓ లు మున్సిపల్ కమిషనర్ రమణ బాబు,మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, కొమరోలు మండల పార్టీ అధ్యక్షులు బోనేనీ వెంకటేశ్వర్లు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ లు దుత్తా బాల ఈశ్వరయ్య , ముచ్చుగుంట్ల రామ సుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు షెహన్ షా వలి, కౌన్సిలర్ లు లొక్కు రమేష్, షేక్ షేక్షా వలి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ శైలం మల్లన్నకు రైలు మార్గం దక్కేనా


**లక్షలాది భక్తుల కోరికలు పట్టించుకోని ప్రభుత్వాలు**

**శ్రీ శైలం క్షేత్రానికి రైలు మార్గం సుగుమం చేయాలని కోరుతున్న భక్తులు**

**హైదరాబాద్ శ్రీశైలం మార్కాపురం రైల్వే లైనుకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి**





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం**
**పెన్ పవర్ మార్చి 13**

మన రాష్ట్రం నుండే కాకుండా దాదాపు 16రాష్ట్రాల నుండి శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి నిత్యం లక్షల సంఖ్యలో వచ్చే భక్తులు,తమకు రైలు మార్గాన్ని సుగుమం చేయాలని కోరుతున్న పాలకులకు పట్టడం లేదు.అందరి సమస్యలు ఆలకించి వారి మొక్కులు తీర్చే శ్రీశైల మల్లికార్జునుడు తన వద్దకు వచ్చే భక్తులకు రైలు మార్గం ఉంటే బాగుండునని కోరుకున్న, ఆ దిశగా ప్రయత్నం చేయని పార్లమెంట్ సభ్యుల, రాష్ట్ర మంత్రుల నిర్లక్ష్యం కారణంగా ప్రతి పాదనగానే మిగిలిపోయింది.12 జ్యోతిలిగాలలో రెండవ జ్యోతిర్లింగంగా పేరు గాంచిన శ్రీశైలం మల్లికార్జున సన్నిధికి భక్తులను చేరవేసే ప్రక్రియ అప్పటి ఆర్థిక శాఖ మంత్రి పార్లమెంట్ సభ్యుల పెదవి దాటి మాటగానే మిగిలిపోయింది. 18 శక్తి పీఠాలలో భ్రమరాంబదేవి శక్తి పీఠం ఒకటి పేరు గడించింది. ప్రతి ఏటా శివ నామస్మరణంతో పాద యాత్ర రూపాన మన రాష్ట్రం నుండే కాకుండా వివిధ రాష్ట్రాల నుండి తరలివస్తున్న భక్తుల హరహోం శివ అనే దైవ నామ స్మరణంతో నల్లమల కొండలు మారు మరోగుతూనే ఉంటాయి. ప్రతి శివరాత్రి పండుగ నాడు శివ మాల ధరించిన భక్తులు దాదాపు 15లక్షల నుండి 20లక్షల వరకు మల్లన్నను దర్శించుకుంటారు. మల్లికార్జున స్వామిని నిత్యం పూజించే ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ కేరళ, మధ్య ప్రదేశ్ ఢిల్లీ, ఉత్తరాంచల్, బీహార్, తమిళనాడు, జర్ఖండ్ రాష్ట్రాల నుండి భక్తులు దర్శించు కుంటుంటారు.అయితే రాజకీయ నాయకులు తాము ఉంటున్న ప్రాంతాల నుండి, రాష్ట్ర రాజదానికి, కేంద్ర రాజదానికి నూతన రైలు మార్గాలు వేయించుకు నేందుకు పోరాడుతున్నారే కానీ, తిరుపతి వెంకన్నకు సమానంగా మల్లికార్జున స్వామికి మెజార్టీ సంఖ్యల భక్తులు ఉన్నారనే విషయం నాయకులకు పట్టడం లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పార్లమెంట్ సభ్యులు శ్రీశైలంకు రైలు మార్గం కావాలని పార్లమెంటులో నోరు మెదపడం లేదు. అప్పట్లో కొనిజేటి రోశయ్య పలు మార్లు ఈ ప్రస్తావన లేవనేత్తరు. మల్లన్న సన్నిధికి రైలు మార్గం కోసం ప్రతిపదాన మొదలు పెడితే, గత కొన్ని యుగాలుగా నుండి శివ నామ స్మరణంతో మారు మారు మ్రాగుతున్న నల్లమల కొండలు కరిగిపోయి రైలు పట్టాలపై శ్రీ శైలనికి మార్గం సులభతరం అవుతుంది. ప్రతి ఏటా మల్లన్నకు వచ్చిన కానుకలను, బంగారు, వెండి, వజ్ర వైడుర్యాలు , గొప్పంగా భక్తులు సమర్పించే నిధులు కోట్ల రూపాయలను లెక్క పెట్టుకుంటూ, కోట్లమంది హృదయాలలో కొలువై ఉన్న మల్లికార్జున స్వామికి కేంద్ర రైల్వే బడ్జెట్ లో నిధులు కేటాయించి రైలు మార్గాన్ని వేయాలనే ఆలోచన ప్రయత్నం లేకపోవడం దురదృష్టకరం.18లక్ష్మి పీఠాలలో అద్భుత లక్ష్మి పీఠంగా పేరొందిన శ్రీ శైలానికి రైలు మార్గం వేయా లనే ప్రతిపదాన మూడు దశబ్దాలుగా జరుగుతుంది. లక్షలాదిమంది భక్తుల కోరిక మేరకు 2009లొ 20మంది యం పి లు, దేవదాయ శాఖ అధికారులు కలిసి సర్వే కూడా నిర్వహించారు ఇప్పటికైనా కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు దిగువ శ్రీశైలానికైనా రైలు మార్గం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**వందల ప్రాణాలు కాపాడవచ్చు..:** శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి అనేక రాష్ట్రాల నుండి వచ్చే భక్తులు నిత్యం ప్రమాదాల భారినపడి మృత్యువాత పడుతూనే వున్నారు. బస్సులు, తుఫాన్, కార్లప్రమాదాలు అనేకం జరిగి కుటుంబాలకు కుటుంబాలు బలై పోయిన సంఘటనలు ఎన్నో. శ్రీశైలం మల్లన్నకు రైలు మార్గం ఏర్పాటు జరిగితే వందల ప్రాణాలు కాపాడవచ్చు.

**కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ను ప్రతిపాదించిన ముఖ్యమంత్రి..:** హైదరాబాద్ నుండి శ్రీశైలం మార్కాపురంకు కొత్త రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరడం జరిగింది. శ్రీశైలం వచ్చే లక్షలాది మంది భక్తులకు నేరుగా రైలు సౌకర్యం కల్పించడం ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ప్రతిపాదించారు. శ్రీశైలానికి మార్కాపురం రైల్వే స్టేషన్ 80కిలో మీటర్లు ఉండటం విశేషం.

# నేడే చివరి గడువు పన్నులపై 50 శాతం వడ్డీ రాయితీ..

### ఈ రాయితీని మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోండి



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 31**

గిద్దలూరు పురపాలక సంఘ పరిధిలో ఇంటి, ఆస్తి పన్ను బకాయిదారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన 50 శాతం వడ్డీ రాయితీకి మార్చి 31తో గడువు ముగియనుంది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు వెల్లడించారు. ఏళ్లుగా పేరుకుపోయిన పన్ను బకాయిలపై వడ్డీలో సగం రాయితీ పొందాలంటే, పాత బకాయిలతో పాటు ప్రస్తుత సంవత్సర పన్నును ఒకేసారి చెల్లించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. గడువు అనంతరం పూర్తి వడ్డీతోనే పన్నులు చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు . ప్రజలకు సౌకర్యం కల్పించేందుకు పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచామని. అదేవిధంగా స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది కూడా పన్నుల వసూళ్లకు సిద్ధంగా ఉన్నారన్నారని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రజలు తమ వడ్డీ భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని, పట్టణ అభివృద్ధికి అందరూ సహకరించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ప్రజలు చెల్లించే పన్నులు రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించబడతాయని తెలిపారు.

# బిజెపి తోనే అభివృద్ధి అన్ని విధాలా సాధ్యం

### బిజెపి నాయకుల స్పష్టం




**పొదిలి, పెన్ పవర్, మార్చి 30**

భారతీయ జనతా పార్టీతోనే అభివృద్ధి అన్ని విధాలా సాధ్యపడుతుందని పలువురు బిజెపి నాయకులు స్పష్టం చేశారు. సోమవారం నాడు పొదిలిలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ మహాభియాన్ ప్రశిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి నాయకులు పలువురు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ మన్ కి బాత్ అంశాలు, మన ఊరు మన జెండా, జనతా వారధి తదితర అంశాల పట్ల కార్యకర్తలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాష్ట్ర బిజెపి మహిళా మోర్చా కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మి, మండల బిజెపి అధ్యక్షులు డి రమణారెడ్డి, బిజెపి మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ భాష తోపాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని టిప్పర్ ఢీకొని విరిగిపడ్డ విద్యుత్ స్తంభం



**కొమరోలు పెన్ పవర్ మార్చి 30**

గుర్తు తెలియని టిప్పర్ ఢీకొని విరిగిపడ్డ విద్యుత్ స్తంభం సంఘటన సోమవారం తెల్లవారుజామున కొమరోలు మండలం పురుషోత్తముని పల్లెకు వెళ్లే దారిలో తాటిరెడ్డిపల్లి ఫీడర్లో జరిగింది. విద్యుత్ శాఖ సిబ్బంది అందించిన సమాచారం మేరకు కొమరోలు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పురుషోత్తంపల్లి మీదుగా తాటిరెడ్డిపల్లి ఫీడర్ లో విద్యుత్ లైన్ ఉన్నది . సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని టిప్పర్ అతివేగంగా వెళుతూ డ్రైవర్ నిర్లక్ష్యంతో అదుపుతప్పి రోడ్డు మార్జిన్లో ఉన్న స్తంభాన్ని బలంగా ఢీకొన్నదని చెబుతున్నారు. దీనితో విద్యుత్ స్తంభం విరిగి ఒకవైపుకు ఒరిగిపోయింది. విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలు తెగిపడ్డాయి. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది ఆ లైన్ కు విద్యుత్ సరఫరా నిలిపివేయడం తో ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి విద్యుత్ శాఖ సిబ్బంది శ్రమించి విద్యుస్తంభాన్ని పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభం విరిగిపడడంతో దాదాపు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా అంతరాయం కలిగింది. విద్యుత్ స్తంభం విరిగి పడ్డానికి కారణమైన గుర్తుతెలియని టిప్పర్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

# పేదవారి సొంతింటి కల తప్పక నెరవేరుస్తా

### -ఎమ్మెల్యే ఇంటూరి -త్వరలో 6 వేల పక్కాఇళ్లు మంజూరు

### -లుంబినీవనంలో సామూహిక గృహ ప్రవేశాలు -హాజరైన ఎమ్మెల్యే నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ హిమవంశీ

**కందుకూరు పెన్ పవర్ మార్చి 30:**

కందుకూరు మున్సిపాలిటీ, 6వవార్డు లుంబినీవనంలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ అనూష పాల్గొన్నారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక లక్ష, కేంద్ర ప్రభుత్వం 1.5 లక్షల రూపాయలు చొప్పున మొత్తం 2.5 లక్షలు మంజూరు చేసింది.లుంబినీవనంలో మట్టిగుంట ఝాన్సీరాణి గృహప్రవేశంలో నేతలు, అధికారులు పాల్గొన్నారు. ఆమెతోపాటు 26వ వార్డు కేసరిగుంట కాలనీకి చెందిన కుంచాల మహేశ్వరమ్మ దంపతులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు పట్టువస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక, అర్బన్ పరిధిలో 410 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. మండలాల పరిధిలో 6 వేల ఇళ్లకు ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే మంజూరు ఉత్తర్వులు వస్తాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. రాబోయే మూడేళ్లలో పెద్ద సంఖ్యలో పక్కాఇళ్లు నిర్మించి, లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు.

కార్యక్రమానికి ముందు కాలనీవాసులు ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, ఇతర అధికారులకు పూలతో స్వాగతం పలికారు. గృహప్రవేశ అనంతరం



మొక్కలు నాటారు. స్థానిక టిడిపి నాయకుడు మెండా లెనిన్ ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు.

ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ఈఈ మాధవరావు, డిఈ నారాయణ, ఏఈలు సుబ్బారావు, నాగరాజు, బాషా, పట్టణ పార్టీ



అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు నాయబ్ రసూల్, స్థానికనేతలు మట్టిగుంట శ్రీను, జంగాల మాల్యాద్రి, అహ్మద్ బాషా, టిడిపి నేతలు ఉన్నం వీరాస్వామి, నార్నె రోశయ్య, ఉప్పుటూరి శ్రీను, అల్లం వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, గుళ్ళా సుధాకర్, షేక్ సలాం, చిట్టా హరికృష్ణ, చదలవాడ కొండయ్య, షేక్ రూబీ, షేక్ మున్నా, గోచిపాతల మోషే, అహ్మద్ బాషా, తలమంచి బ్రహ్మయ్య, జియావుద్దీన్, నసీర్, రాయపాటి శ్రీను, రెబ్బవరపు మాల్యాద్రి, కూనం నరేంద్ర, ఈదర నరసయ్య, ఫిరోజ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ కార్యవర్గం ఏకగ్రీవం




**కందుకూరు పెన్ పవర్ మార్చి 30**

పట్టణంలోని కోటారెడ్డిభవన్ లో ఆదివారం జరిగిన ఏఐటీయూసీ నియోజకవర్గ పదవ మహాసభలలో ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఎర్రం శెట్టి ఆనందమోహన్ అధ్యక్షులుగా కె మురళీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కే వీరారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గం ప్రకాశం జిల్లాలో కలిపిన సందర్భంలో జిల్లాలో అన్నిచోట్ల ఏఐటీయూసీ మహాసభలు నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలిపారు. అందులో భాగంగా కందుకూరు నియోజకవర్గంలో మహాసభ జరిపి నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు గౌరవ అధ్యక్షులుగా బూసి సురేష్ బాబు, ఉపాధ్యక్షులు కాకుమాని రవణమ్మ, జమ్మలమడుగు రవి, కార్యదర్శి నత్తా రామారావు, సహాయ కార్యదర్శిగా కత్తి విజయ్, కోశాధికారిగా నీలి శెట్టి నరసయ్య, కమిటీ సభ్యులుగా డి నాగరాజు, పులి నాగేశ్వరరావు, బొల్లోజుల బాల బ్రహ్మచారి, ఆలూరి రమేష్, మరో ముగ్గురితో కలిపి 15 మంది కమిటీని ఏర్పాటు చేయటం జరిగిందని, ఆ కమిటీని అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. నూతన ఏఐటియుసి నాయకత్వం కార్మికుల కోసం అనునిత్యం కృషి చేయాలని ఆయన కోరారు. నూతనంగా ఎన్నిక కాబడిన ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వై. ఆనందమోహన్ మాట్లాడుతూ ఏఐటీయూసీ అనుబంధ సంఘాలైన అన్ని యూనియన్లను బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని, వెంటనే వారికి వేతనాలు పెంచాలని, వారికి అవసరమైన కనీస వసతులను ఎప్పటికప్పుడు ఇవ్వాలని ఆయన తెలిపారు. స్థానిక సమస్యలపై త్వరలో కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, స్కందపురి పెయింట్ వర్కర్స్ యూనియన్ నాయకులు, టైల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ముఠావర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ నూతన గృహ ప్రవేశం వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 30**

గిద్దలూరు పట్టణంలోని మోడంపల్లె లే అవుట్ ప్రక్కన ఎన్టీఆర్ కాలనీ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నూతన గృహ నిర్మాణం లో కొత్త లక్ష్మీ దేవి , సుబ్బరత్నం దంపతులకు నూతన గృహ మంజూరు అయింది. ఈగృహం ను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు . లబ్ధిదారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని




ఇళ్లు లేని వారికి గృహ నిర్మాణ సంస్థ ద్వారా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం అండగా ఉంటుందని పేదలకు కూడు - గుడ్డ అందించడమే ప్రభుత్వం లక్ష్యంగా సాగుతోందని పేర్కొన్నారు . రాబోవు రోజుల్లో ఎండలు ఎక్కువగా ఉంటాయని నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూ పొందించామని తెలిపారు . కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు, పురపాలక సంఘం కమీషనర్ రమణ బాబు, అధికారులు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి,పాలుగుళ్ల ప్రతాప్ రెడ్డి, పాలుగుళ్ల చిన్న శ్రీనివాస్ రెడ్డి,కడియం శేషగిరి, కౌన్సిలర్ లు లొక్కు రమేష్, దెమా నర్సింహులు, స్థానిక నాయకులు తదితరులు గృహ ప్రవేశం వేడుకలో పాల్గొన్నారు.

# పేదలకు గూడు - మోదీ గ్యారెంటీ : డాక్టర్ ఏలూరి

**పెద్దదోర్నాల పెన్ పవర్ మార్చి 30**

ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పంతో పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న ప్రధానమంత్రి అవాస్ యోజన దేశవ్యాప్తంగా విశేష ఫలితాలను అందిస్తున్నదని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, వారికి భద్రతతో కూడిన భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతోందని పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో వేలాదిగా పక్కా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఆనందదాయకమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభం కావడం



అభినందనీయమని అన్నారు. ఇది కేవలం ఇళ్ల నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా, పేదల భవిష్యత్తు నిర్మాణానికి కీలక అడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కల్పించడం మోదీ గారి హామీ అన్నారు, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ సంకల్పం సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధికి నిదర్శనమని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి అవాస్ యోజన ద్వారా దేశంలోని లక్షలాది కుటుంబాలు తమకంటూ ఒక గూడు ఏర్పాటు చేసుకుని హాయిగా జీవనం సాగిస్తున్నారని ఏలూరి అన్నారు.

# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాదులు

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం





**పొదిలి, పెన్ పవర్ , మార్చి 30**

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాదులు లాంటివారని మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మార్కాపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్. టి. రామారావు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు తాము వెన్నంటే ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం సీనియర్ నాయకులైన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ సర్పంచ్ వై వెంకటేశ్వర రెడ్డి లను ఎమ్మెల్యే కందుల శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మాన్ బేగ్ మరణం బాధాకరం: కోటిరెడ్డి

**మార్కాపురం పెన్ పవర్ మార్చి 30**

ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలల అధినేత వైఎస్ఆర్సిపి రాష్ట్ర సెక్రటరీ, కొండపి నియోజవర్గ పరిశీలకులు డాక్టర్.మీర్జా షంషీర్ అలీ బేగ్ తండ్రి ఉస్మాన్ బేగ్ మరణం చాలా బాధాకరమని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కమిటీ సభ్యులు ఉరుముల కోటిరెడ్డి అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ మృతి చెందడం కలిసి వేసిందని అన్నారు. ముస్లింల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు మరవలేనివని తెలిపారు.తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థ ద్వారా పేద విద్యార్థులకు సహాయం అందించిన గొప్ప మనసున్న వ్యక్తి అని కొనియాడారు.



# దేవత మూర్తులు ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలి





**కొమరోలు పెన్ పవర్ మార్చి 30**

దేవతామూర్తులను ఆరాధించటం మన సాంప్రదాయమని, దేవతా మూర్తుల ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని గిద్దలూరు మాజీ శాసనసభ్యులు మార్కాపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అన్నా రాంబాబు పేర్కొన్నారు. కొమరోలు మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీలోని పామూరు పల్లె గ్రామంలో వెలసిన సీతా లక్ష్మణ సమేత రామస్వామి వారి ఆలయంలో గత మూడు రోజులుగా ధ్వజ విగ్రహ ప్రతిష్ట వేడుకలు జరుగుతున్నాయి. కాగా సోమవారం వేడుకల ముగింపు సందర్భంగా గిద్దలూరు మాజీ శాసనసభ్యులు అన్నా రాంబాబు, కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు ,,కొమరోలు మండల సీనియర్ వైసీపీ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి. జే ఎస్ సి కన్వీనర్ మోహన్ రెడ్డి తదితరులు పామూరు పల్లి గ్రామానికి వెళ్లి దేవతామూర్తుల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు అన్నా రాంబాబుతో పాటు వైసీపీ నాయకులకు గ్రామం వెలుపల ఘన స్వాగతం పలికి శాలువా పూలమాలతో సన్మానించి, మేళ తాళాలతో ఆలయం వద్దకు చేర్చారు.

ఆ సందర్భంగా అన్న రాంబాబు తదితర నేతలు ఆలయంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి ప్రార్థించారు. ప్రజలు దేవతామూర్తుల ఆశీస్సులు ,కరుణాకటాక్షాలతో ఎల్లవేళలా సుఖ సంతోషాలతో, పాడిపంటలతో జీవించాలని వారు ప్రార్థించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అదే గ్రామంలో గల అభయాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండల వైసీపీ నాయకులు బంగారు విశ్వరూపం, మండల పరిషత్ అధ్యక్షులు షేక్ మౌలాలి, ఎంపీటీసీలు ఎస్ఎం సుభాని, వెంకటరమణ, చింతలపల్లి మాజీ సర్పంచ్ సారే జనార్ధన్ నాయుడు, తోపాటు వైసిపి నాయకులు గోల్కొండ అబ్దుల్ సుభాన్, అబ్దుల్ సత్తార్, గఫూర్, ఉలాపు రామచంద్రుడు, పామూరు పల్లి గ్రామానికి చెందిన చంద్రమోహన్ తదితర పెద్దలు పాల్గొన్నారు.

## దేవతామూర్తుల ఆశీస్సులే ప్రజలకు శ్రీరామరక్ష





**కొమరోలు పెన్ పవర్ మార్చి 30**

దేవతామూర్తుల ఆశీస్సులే ప్రజలకు శ్రీరామరక్ష అని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. కొమరోలు మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీలోని పామూరు పల్లి గ్రామంలో వెలసిన సీతా లక్ష్మణ సమేత రామస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న ధ్వజ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి సోమవారం గిద్దలూరు శాసనసభ్యులు అశోక రెడ్డి తో పాటు తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆ గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ,కొమరోలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, డైరెక్టర్లు బిజ్జాల తిరుమలరెడ్డి, షేక్ హసీనా, గజ్జలకొండ నారాయణ తదితర నేతలను గ్రామం వెలుపల శాలువా పూలమాలతో సన్మానించి ఘన స్వాగతం పలికి మేళ తాళాలతో ఆలయం వద్దకు చేర్చారు. ఆ సందర్భంగా నేతలు ఆలయంలో దేవత మూర్తుల విగ్రహాలకు పూజలు చేశారు. ప్రజలు దేవతామూర్తుల ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలని రైతులు పాడి పంటలతో వర్ధిల్లాలని, అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సవాలతో జీవించాలని వారు దేవత మూర్తులను ప్రార్థించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు పామూరు పల్లె గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు, తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శీలంవారిపల్లి లో ఘనంగా గ్రామ దేవతల గ్రామోత్సవం



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 30**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో గ్రామదేవతలైన అంకాలమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల తిరునాళ్ల సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన గ్రామోత్సవం విశేష భక్తి శ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామం అంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. అంకాలమ్మ-పోలేరమ్మ తల్లి విగ్రహాలను పూలదండలతో, పరిమళమయిన పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి దేవస్థాన కమిటీ మరియు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రతిష్టించారు.ఆలయ ప్రాంగణం నుండి ప్రారంభమైన ఊరేగింపు గ్రామం లోని పలు వీధుల మీదుగా సాగింది. ఈ సందర్భంగా బాణాసంచా వెలుగుల్లో, డప్పుల నాదం, మేళతాళాల హోరుతో గ్రామస్తులు ఘనంగా ఊరేగించారు. అమ్మవార్ల ఊరేగింపు తమ ఇళ్ల ముందు చేరుతుందని ముందే సిద్ధమైన ప్రజలు, కుటుంబ సభ్యులతో కలిసి బిందెలతో వారు పోసి స్వాగతం పలికారు. టెంకాయ, కర్పూరంతో నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకొని అమ్మవారి ఆశీస్సులు పొందారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గ్రామస్తులకు ఆశీర్వచనాలు అందిస్తూ, తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. చిన్నాపెద్దా తేడా లేకుండా గ్రామంలోని ప్రతి ఇంటి వారు ఈ వేడుకల్లో పాల్గొని భక్తిరసాన్ని ఆస్వాదించారు. గ్రామం మొత్తం దీపాల వెలుగులతో, పూలతోరణాలతో పండుగ వాతావరణంలో అలరారగా, తిరునాళ్ల ఉత్సవనిలో శీలంవారిపల్లి మరోసారి తన సంప్రదాయాన్ని, భక్తిమా నంగా చాటుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## అంకాలమ్మ, పోలేరమ్మ గ్రామదేవతలను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కదిరి



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 30**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో అంకాలమ్మ పోలేరమ్మ గ్రామ దేవతల మహోత్సవాలలో భాగంగా సోమవారం అంకాలమ్మ ,పోలేరమ్మ అమ్మవార్లకు పొంగళ్ళు కార్యక్రమం నిర్వహించారు .ఈ సంధర్భంగా మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు ,కదిరి ప్రకాశ్ రావు,కదిరి పార్థసారథి కుటుంబ సభ్యులు ,గ్రామస్తులు పొంగళ్ళు పెట్టుకొని అనంతరం అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు .ఆలయ అర్చకులు డి రోశయ్య తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేసారు.

## జాతీయ స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 30**

గిద్దలూరు మండలం చట్టిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవస్థానం నందు నిర్వహించిన జాతీయ స్థాయి ఎడ్లు బండలాగుడు పోటీలను గౌరవ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన ఎడ్ల బలప్రదర్శన ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కు ఆలయ కమిటీ సభ్యులు ఆలయమర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిచి తీర్థప్రసాదాలు శ్వీకరించారు. అనంతరం బండలాగుడు పోటీలను ప్రారంభిస్తూ, గ్రామీణ క్రీడలు, సంప్రదాయాలను పరిరక్షించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు యువత ఇలాంటి సాంప్రదాయ క్రీడల్లో పాల్గొని గ్రామ సంస్కృతిని కొనసాగించాలని ఆయన కోరారు. పోటీలు ఉత్సాహభరితంగా సాగుతూ ప్రేక్షకులను అలరించాయి ఈ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, మండల, పట్టణ నాయకులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మె కాలంలో చేసిన ఒప్పందాలకు జిఓ లు జారిచేయాలి

### జీతాలు పెంచి ప్రభుత్వ మే చెల్లించాలి

### ఎ పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి ఐ టి యు)

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 30**


మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వమే జీతాలు పెంచి , చెల్లించాలని, సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ, ఇతర సమస్యల పరిష్కారం చేయాలని సోమవారం గిద్దలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలియజేశారు మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచి, , ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని, , 12వ పి ఆర్ సి ని వెంటనే ఏర్పాటు చేయాలి, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, పిల్లలకు ఉద్యోగాలు, హెల్త్ కార్డులు, సంక్షేమ పథకాలు అమలు తదితర డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు .ఈ సందర్భంగా సిఐటియు మార్కాపురం జిల్లా అధ్యక్షులు టి ఆవులయ్య పాల్గొని మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచి 7 ఏళ్లు గడుస్తున్నదని ,ఈ కాలంలో నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు, ఇంటి బాడుగలు , విద్యా - వైద్య ఖర్చులు అనేక రేట్లు పెరిగాయని. వీటికి తోడు ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేయడం లేదన్నారు. ఫలితంగా మున్సిపల్ కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. 11వ పి ఆర్ సి గడువు దాటిపోయి రెండున్నరేళ్లు గడిచిపోయిందని 12వ పిఆర్సి కమీషన్ ఏర్పాటు చేయకుండా గత వైసిపి , ప్రస్తుత తెలుగుదేశం కూటని ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గత 17 రోజుల సమ్మె కాలం ఒప్పందాలకు జీవోలు జారీ చేయకుండా గత 23 నెలలుగా తెలుగుదేశం ప్రభుత్వం




కాలయాపన చేస్తున్నదని పేర్కొన్నారు. 60 ఏళ్లు నిండాయని రిటైర్మెంట్ చేశారు. పైసా కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద చెల్లించలేదని. పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని, మరోవైపు రాజకీయ జోక్యం తో కొత్తవారిని డైలీ వేజ్, ఎం -బుక్, అడిషనల్ వర్కర్స్, తదితర పేర్లు పెట్టి అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. దశాబ్దాల తరబడి పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని లేని పక్షంలో నిరవధిక సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బి నర్సింహులు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం మురళి ,కే బాలయ్య పాపయ్య పి రవి సిఐటి నాయకులు డి తామస్ తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థాన అభివృద్ధిలో చలపతిరావు సేవలు అభినందనీయం

### మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 30**

మండలం పరిధిలోని శీలంవారిపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్లస్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇరగని చలపతిరావు-సుశీలమ్మ దంపతుల 60వ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించేలా కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్వర్ణవివాహ మహోత్సవానికి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు, కదిరి ప్రకాష్ రావు, కదిరి పార్థసారథి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై దంపతులను పూలమాలలతో శాలువాలతో ఘనంగా సత్కరించి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు మాట్లాడుతూ మా తండ్రిగారి కాలం నుండి చలపతి అన్న కుటుంబంతో కలిసిమెలిసి ఉండేవాళ్ళమని అన్నారు దేవస్థానం అభివృద్ధిలో చలపతిరావు సేవలు అభినందనీయమని అన్నారు చలపతిరావు-సుశీలమ్మ దంపతుల సత్సంకల్పం, సేవాస్ఫూర్తి గ్రామాభివృద్ధికి ఆదర్శమని, ముఖ్యంగా విద్యా రంగంలో చలపతిరావు చేసిన సేవలు ప్రశంసనీయం అని గ్రామస్తులు పేర్కొన్నారు. స్వర్ణవివాహ వేడుక సందడి మధ్య కుటుంబ సభ్యులు ఆనందోత్సలతో ఉత్సాహభరితంగా జరిగాయి అనంతరం గ్రామంలోని ప్రజలందరికీ అల్పాహార విందు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, చలపతిరావు కుటుంబ సభ్యులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో నిరుపేదలు లేకుండా చూడటమే పి4 లక్ష్యం

## బంగారు కుటుంబాలకు అండగా ఉండాలి -జిల్లా కలెక్టర్ విజయ సునీత,ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ మార్చి 30**

జిల్లాలో బంగారు కుటుంబాలకు సహాయం చేసి అండగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్ లో సోమవారం పి4 మొదటి వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేతనైనంత బంగారు కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. పి4 కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు జీవితాల్లో వెలుగు నింపాలని అన్నారు. పరోపకారం ద్వారానే జీవితానికి సార్థకత ఏర్పడుతుందని తెలిపారు. మార్కాపురం జిల్లా లో 50 వేల కుటుంబాలు సహాయం కోసం ఎదురుచూస్తున్నాయన్నారు.





మార్గదర్శకులు ముందుకు వచ్చి పేద కుటుంబాలను ఆదుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ పి4 కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మానస పుత్రికగా అభివర్ణించారు. మార్కాపురం నియోజకవర్గంలో 1500 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు వివరించారు. రాష్ట్రంలో నిరుపేదలు లేకుండా చూడటమే ఈ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలను పాటించి ఈ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ స్వరూప రాణి, ఐసిడిఎస్ ఇంచార్జి పిడి పద్మావతి, ఆర్డీవో ప్రభాకర్, ఏఎంసీ చైర్మన్ వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్లు, రిక్షాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

### -స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ద్వారా వాహనాల కేటాయింపు -కందుకూరు మండలంలోని 19 పంచాయతీలకు పంపిణీ

### -స్వర్ణఆంధ్ర - స్వచ్ఛఆంధ్రకు సహకరించాలని ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి

**కందుకూరు పెన్ పవర్ మార్చి 30**

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు మండలంలోని 19 పంచాయతీలకు చెత్తతరలింపు వాహనాలను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. మండలంలోని మోపాడు, ఓగూరు పంచాయతీలకు ఒక్కొక్కటి 8.5 లక్షలు విలువచేసే ట్రాక్టర్లను ఎమ్మెల్యే నాగేశ్వరరావు పంపిణీ చేశారు. అలాగే గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణకు వీలుగా 32 రిక్షాలను కూడా అందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఆరోగ్యకరంగా మార్చేందుకు స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 55 కోట్లతో 93 ట్రాక్టర్లను పంపిణీ చేస్తోందన్నారు. రెండువేల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి పంచాయతీకి ట్రాక్టర్ ఇస్తున్నారని తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 12 వేల రిక్షాలు, 5 వేల తోపుడుబండ్లను అందిస్తోందని గ్రామాల్లో చెత్తను సరైన విధానంలో సేకరించేందుకు, అక్కడ నుంచి చెత్త నుండి సంపద తయారీకేంద్రాలకు తరలించేందుకు, ఈ వాహనాలు ఉపయోగపడతాయని అన్నారు.



ప్రజలంతా రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్రగా మార్చేందుకు సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు ట్రాక్టర్ ను కొద్దిసేపు సరదాగా నడిపారు. వాహనాలను జాగ్రత్తగా ఉపయోగించాలని, చెత్త సేకరణలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నరిశెట్టివారిపాలెం సర్పంచ్




ముప్పాళ్ళ శ్రీను, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు బొద్దులూరి కొండలరావు, పచ్చవ తిరుపతిస్వామి, భోగినేని వెంకటేశ్వర్లు, రాయపాటి శ్రీను, గొంది నర్సింగరావు, సూరం చిరంజీవిరెడ్డి, నాదెళ్ల మాధవ, వంకదారి శ్రీను, రెబ్బవరపు మాల్యాద్రి, ఈదర నరసయ్య, రావుల రవి, పంచాయతీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పక్షుల దాహం తీర్చుదాం...



**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 30**

మండుతున్న ఎండలు, రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జీవజాలం తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేళ, పక్షుల దాహార్తిని తీర్చేందుకు పుల్లలవచెరువు పోలీస్ స్టేషన్ ఎస్సై బి. సాంబ శివరావు వినూత్న చర్యలు చేపట్టారు.పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు చోట్ల చిన్న చిన్న టబ్బుల్లో నీటిని ఏర్పాటు చేసి పక్షులకు ప్రాణాధారంగా నిలిచారు. వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో చెట్లు, నీటి వనరులు తగ్గిపోవడం వల్ల పక్షులు నీటి కోసం ఎగిరే దూరం పెరిగింది. ఈ నేపథ్యంలో వాటి ప్రాణాలు కాపాడాలని భావించిన ఎస్సై సాంబ శివరావు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్టేషన్ పరిధిలోని సిబ్బంది సహకారంతో పక్షులు సులభంగా చేరుకునే ప్రదేశాల్లో నీటి టబ్బులను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి రోజు వాటిలో స్వచ్ఛమైన నీటిని నింపుతూ పక్షులకు ఉపశమనం కలిగిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మనుషులకే కాదు, ప్రతి జీవికి జీవించడానికి నీరు అవసరం.వేసవిలో పక్షులు నీటి కోసం అలమటిస్తుంటాయి. చిన్న ప్రయత్నంతో వాటి ప్రాణాలను కాపాడవచ్చు అని తెలిపారు.ప్రజలు కూడా తమ ఇళ్ల వద్ద, తోటల్లో చిన్న పాత్రల్లో నీటిని ఏర్పాటు చేసి పక్షులకు సహాయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.పోలీస్ స్టేషన్‌లో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని చూసి స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పోలీసులంటే కేవలం చట్టం అమలు చేసే వారు మాత్రమే కాకుండా, సమాజం పట్ల బాధ్యతతో పనిచేసే వారని మరోసారి నిరూపితమైంది. పక్షులపై చూపిన ఈ మానవత్వం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.ఇలాంటి చిన్న చర్యలతో ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముస్లిం స్మశాన వాటికను యధావిధిగా కొనసాగించాలి -డాక్టర్ షేక్ మహబూబ్ వలి



**తర్లుపాడు పెన్ పవర్ మార్చి 30**

మండలంలోని సీతనాగులవరం గ్రామంలో ఉన్న ముస్లిం స్మశాన వాటిక స్థలాన్ని యధావిధిగా కొనసాగించాలని, స్మశాన వాటికకు ప్రహరి గోడ నిర్మించాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రాన్ని అందజేశారు. సీతానాగులవరం పంచాయితీ తీర్మానం ద్వారా 22/3 సర్వే నెంబరు లో ఉన్న 13 సెంట్లు భూమిని ముస్లిం స్మశాన వాటిక స్థలాన్ని కేటాయించారు. స్మశాన వాటికలో ముస్లింలను సమాధి చేసి కూడా ఉన్నారు. అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆ ముస్లిం స్మశాన వాటిక స్థలాన్ని వేరే ప్రభుత్వ సంస్థలకు లేదా వేరే వాటికి ఉపయోగించుకోవాలని గత రెండు రోజుల క్రితం స్మశాన వాటిక స్థలాన్ని శుభ్రపరిచారు. ఈ విషయాన్ని తెలిసిన తర్వాత ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ గ్రామానికి వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించారు.జిల్లా కలెక్టర్ కి ముస్లింల స్మశాన వాటికను యధావిధిగా కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని అందజేశారు. రానున్న రోజుల్లో సీతా నాగులవరం ఆ గ్రామం కూడా మార్కాపురం మున్సిపాలిటీలో కలువనున్న సందర్భంగా ముస్లింల ప్రజలు ఆ ప్రాంతాలలో కూడా ఉంటారు కాబట్టి ఆ స్థలాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఆ స్థలంలో ప్రభుత్వ ఆసుపత్రి కట్టాలని ఓ కథనం కూడా ఉంది కానీ ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించి గతంలో ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించి స్థలాన్ని అయితే కేటాయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ఉగ్ర





**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 30**

మండలంలోని అంబవరం, అంబవరం కొత్తపల్లి గ్రామపంచాయతీలలో నిర్మించిన స్వర్ణ గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్ కేంద్రం, సిమెంట్ రోడ్డులను సోమవారం కనిగిరి శాసనసభ్యులు జిల్లా టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ స్వర్ణ గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు మరింత వేగంగా పారదర్శకంగా సేవలు అందించాలని, సచివాలయ పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాలని సూచించారు అనంతరం హెల్త్ క్లినిక్ కేంద్రాన్ని ప్రారంభించి అక్కడి వైద్య సిబ్బందిని కలిశారు. గ్రామాల్లో ప్రాథమిక వైద్య సదుపాయాలు బలోపేతం కావడం ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతో ఉపయుక్తమవుతుందని పేర్కొన్నారు.

తరువాత పంచాయతీ లల్లో ఇటీవల నిర్మించిన సిమెంటు రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయళ్ల నారాయణరెడ్డి, అంబవరం, అంబవరం కొత్తపల్లి సర్పంచ్ లు ముప్పాళ్ళ శ్యామలమ్మ, కొండయ్య రాజు, భైరవకోన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, అట్లూరి రామకృష్ణంరాజు, వెంకట్రామరాజు, వెంకట నరసరాజు, కోనంగి వెంకట కొండయ్య, రేనాటి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు స్వర్ణ గ్రామ స్వర్ణ గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామస్తులు పాల్గొన్నారు.


## అట్టహాసంగా చిలకపాటి మధు ప్రమాణ స్వీకారం

### -శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నేతలు

### -ఎమ్మెల్యే ఇంటూరికి కృతజ్ఞతలు తెలిపిన మధు







**కందుకూరు పెన్ పవర్ మార్చి 30**

పట్టణానికి చెందిన బీసీ నాయకుడు చిలకపాటి మధు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని బిసి భవన్ లో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతి సభ్యులందరి చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చిలకపాటి మధు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, యువ నాయకులు నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తనపై ఎంతో నమ్మకంతో ప్రోత్సాహం అందిస్తున్నారని, కందుకూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, బీసీల ఐక్యతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మధు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కి ధన్యవాదాలు తెలియజేశారు. చిలకపాటి మధు ప్రమాణ స్వీకారానికి కందుకూరు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు తరలి వెళ్లారు. ప్రమాణ స్వీకారం అనంతరం మధును ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ వడ్డెళ్ళ రవిచంద్ర, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీనివాసరావు, చుండూరి శ్రీను, రావూరి రామకోటయ్య, గొల్లపూడి శ్రీనివాసరావు, షేక్ షరీఫ్, మాదాల రవీంద్ర, పూజల పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సాయం చేసేందుకు ముందుకు రావాలి

### - ఎమ్మెల్యే ఇంటూరి పిలుపు -పేదరిక నిర్మూలన కోసమే పి 4 కార్యక్రమం

### -సబ్ కలెక్టర్ కార్యాలయంలో పి4 మొదటి వార్షికోత్సవ వేడుకలు

### -హాజరైన ఎమ్మెల్యే,సబ్ కలెక్టర్ -ముగ్గురు మార్గదర్శులకు సత్కారం





**కందుకూరు పెన్ పవర్ మార్చి 30**



రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించాలన్న మంచి ఉద్దేశంతో పి4 (పబ్లిక్ - ప్రైవేట్ - పీపుల్ - పార్ట్ నర్ షిప్) కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు శ్రీకారం చుట్టారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పి4 మొదటి వార్షికోత్సవ వేడుకలను సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ హిమవంశీ అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా సాయం అందుకుంటున్న వారు కాకుండా వైద్యం, చదువు, ఉపాధి లాంటి తీరని అవసరాలను గుర్తించి, సాయం అందించేందుకు కార్యక్రమం అమలు చేస్తున్నారని చెప్పారు. బయట ప్రాంతాల్లో స్థిరపడి, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు సొంత ఊరిలో పేదలకు అండగా నిలిచేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ముఖ్యంగా పేద పిల్లల చదువులు, వైద్యం కోసం సాయం అందించాలన్నారు. కందుకూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు సాయం కోరుతున్న 13,591 బంగారు కుటుంబాలను గుర్తించామని ఎమ్మెల్యే ఇంటూరి తెలిపారు. వారికి సాయం అందించేందుకు 545 మంది మార్గదర్శకులు పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఇందులో 3 వేల కుటుంబాలను దత్తత తీసుకునే ప్రక్రియ పూర్తయిందని వివరించారు. మిగిలిన మార్గదర్శులతో త్వరలోనే సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా గుడ్లూరు మండలం రాళ్లపాడు గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన దగ్గుమాటి సుబ్బారావు, కందుకూరు ఆర్టీసీ బస్టాండ్ లో 12 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసిన పిడికిటి వెంకటేశ్వర్లు, ప్రతినెలా 6 కుటుంబాలకు 2 వేల రూపాయల చొప్పున ఆర్థిక భరోసా కల్పిస్తున్న కాకుమాని ప్రవీణ్ కుమార్ లను ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ కలిసి ఘనంగా సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. కార్యక్రమంలో కందుకూరు తహసిల్దార్ మురళి, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ అనూష, అల్లం వెంకటేశ్వర్లు, గొంది నరసింగరావు, యంగ్ ప్రొఫెషనల్ అనిల్, నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా నూతన గృహప్రవేశ మహోత్సవం





**మార్కాపురం రూరల్ పెన్ పవర్ మార్చి 30**

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రభుత్వ నూతన గృహప్రవేశాల్లో భాగంగా మార్కాపురం పట్టణంలోని 16 వార్డులో భగత్ సింగ్ నగర్ లో నూతన గృహ ప్రవేశ మహోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉందని దాని ఫలితమే ఈరోజు లబ్ధిదారులకు నూతన గృహప్రవేశ మహోత్సవాలు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని అన్నారు. మార్కాపురం నూతన జిల్లాలో లబ్ధిదారులైన ప్రతి ఒక్కరికి ఇల్లు కట్టి ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో అన్ని శాఖల అధికారులు, పట్టణ తెలుగుదేశం నాయకులు, 16 వ వార్డ్ తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుంకరి వెంకటాద్రి-సృజనా దంపతుల భక్తి సేవకు భక్తుల ప్రశంసలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 30**

వరికుంటపాడు గ్రామంలోని వైకుంఠపురం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో సోమవారం ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి మాజీ మండల అధ్యక్షులు సుంకరి వెంకటాద్రి-సృజనా దంపతులు విచ్చేసి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. స్వామివారి సేవార్థం దంపతులు సుమారు రూ. 2,50,000/-విలువ గల రెండు సెటారులు, రెండు ప్లేట్లను ఆలయానికి అందజేశారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక గోత్రనామాలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించారు. దేవాలయ ప్రాంగణం భక్తి నినాదాలతో మారుమ్రోగింది.తదుపరి ఆలయ ధర్మకర్త



పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు స్వామివారి చిత్రపటాలను అందజేసి, శాలువాతో ఘనసత్కారం చేశారు. సేవాభావంతో దేవస్థానాన్ని అభివృద్ధి చేయాలన్న దంపతుల సంకల్పాన్ని



అభినందించారు ఈ సందర్భంగా వెంకటాద్రి మాట్లాడుతూ, "వైకుంఠపురం దేవాలయం తీర్థక్షేత్రంగా అభివృద్ధి చెందుతున్న తీరు భక్తిగా మనసుకు హర్షం కలిగిస్తోంది. తిరుమల తరహాలో ఇక్కడ నిర్వహిస్తున్న పూజావిధానాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో కదిరి వెంకట కాంతారావు, సుంకర రాధ తదితరులు పాల్గొన్నారు.

# సిక్కోలులో దువ్వాడ రాజకీయం

**శ్రీకాకుళం, మార్చి 30,పెన్ పవర్ :**
: శ్రీకాకుళం జిల్లా రాజకీయాలు చాలా విచిత్రంగా ఉంటాయి. దశాబ్దాలుగా ఇక్కడ రాజకీయం కింజరాపు వర్సెస్ ధర్మాన ఫ్యామిలీ అన్నట్టు ఉంటుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధర్మాన.. టిడిపి అధికారంలోకి వస్తే కింజరాపు కుటుంబాల హవా ఉంటుంది. అదే చాలామంది రాజకీయ పార్టీల నేతలకు మింగుడు పడని విషయం. ఇప్పుడు అటువంటి సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు దువ్వాడ శ్రీనివాస్. ఆ రెండు కుటుంబాల మధ్య రాజకీయ అనైతిక బంధం కొనసాగుతోందని ఆయన చెబుతున్నారు. గత కొద్ది కాలంగా ఇదే విషయాన్ని పదేపదే హెచ్చరిస్తూ వచ్చారు. ఇప్పుడు ఏకంగా ఆ రెండు కుటుంబాలకు గట్టి వార్నింగ్ ఇస్తున్నారు. దువ్వాడ శ్రీనివాస్ కు నేరుగా రాజకీయ ప్రత్యర్థి కింజరాపు ఫ్యామిలీ కాగా.. ఒకే పార్టీలో ప్రత్యర్థులు ధర్మాన సోదరులు. ప్రస్తుతం వ్యక్తిగత కుటుంబ వ్యవహారాలతో వైసిపి సస్పెన్షన్ వేటులో ఉన్నారు దువ్వాడ శ్రీనివాస్. అయితే వైసీపీలో తన సస్పెన్షన్ కు ధర్మాన, కింజరాపు కుటుంబాలే కారణమని కోపంతో రగిలిపోతున్నారు.అయితే దువ్వాడ శ్రీనివాస్ మాత్రం విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తన మనసునిండా జగన్మోహన్ రెడ్డి ఉన్నారని చెబుతున్నారు. అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి ధర్మాన సోదరులు తనను సస్పెండ్ చేయించారని చెప్పుకొస్తున్నారు. అయినా సరే పార్టీలోకి వస్తానని తేల్చి చెప్తున్నారు.
జగన్ మాత్రం ఏం సినిమా హీరో అనుకుంటున్నావా అని వ్యంగ్యంగా అడుగుతున్నారు. అదే సమయంలో కింజరాపు కుటుంబం పై కూడా నోరు పారేసుకుంటున్నారు. నా వెంట్రుక కూడా పీకలేరు అంటూ బాబాయ్ అబ్బాయిలను హెచ్చరిస్తున్నారు. తను చెప్పాలనుకున్నది చెబుతున్న దువ్వాడ శ్రీనివాస్ మాటను ఎవరు వినే పరిస్థితిలో లేరు. జగన్ పై అభిమానం కొండంత ఉంది. కానీ వైసీపీలో చోటు లేదు. ధర్మాన కుటుంబం పార్టీని నాశనం చేసిందని చెబుతున్నారు. కానీ వారు లేకుండా ఇప్పుడు జిల్లాలో పార్టీ లేదు. కింజరాపు ఫ్యామిలీ ఏం చేయలేదని చెబుతున్నారు. కానీ జిల్లాలో ఆ కుటుంబానికి మంచి ఆదరణ ఉంది. అందుకే ఇప్పుడు దువ్వాడ శ్రీనివాస్ సొంత యూట్యూబ్ ఛానల్ పెట్టుకుని కింజరాపు, ధర్మాన కుటుంబం పై ఓ రేంజ్ లో విరుచుకుపడుతున్నారు.శ్రీకాకుళం జిల్లాలో మూలపేట కోర్టు నిర్మాణం దాదాపు చివరి దశకు వచ్చింది. అయితే ఆ పోర్టు తమ ప్రభుత్వ హయాంలో జరిగిందని వైసిపి, ఇటు టిడిపి క్రెడిట్ కోసం ఆరాటపడుతున్నాయి. ధర్మాన సోదరుల నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీమూలపేట కోర్టు సందర్శనకు సిద్ధపడింది. దీంతో మళ్లీ దువ్వాడ శ్రీనివాస్ కు కోపం వచ్చింది. పళ్ళు కొరుకుతూ రగిలిపోతూ కనిపించారు దువ్వాడ శ్రీనివాస్. ఆ పోర్టు క్రెడిట్ జగన్మోహన్ రెడ్డిదని.. తరువాత తనదేనని చెప్పుకొచ్చారు దువ్వాడ. అయితే దువ్వాడ తాను అభిమానించే జగన్ వద్దకు వెళ్లలేకపోతున్నారు. తాను సాధించానని చెబుతున్న మూలపేట పోర్టును సందర్శించలేకపోతున్నారు. అందుకే ఇప్పుడు ఆ రెండు కుటుంబాలపై పడ్డారు దువ్వాడ. సోషల్ మీడియాలో దీనిపైనే సెటైర్లు పడుతున్నాయి.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## పార్టీలు మార్పులు తప్పవా

**విజయవాడ, మార్చి30, పెన్ పవర్:** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నాయకుల పాత్ర మరింత కీలకంగా మారుతున్నది. గత ఎన్నికల సమయంలోనే చాలా మంది నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పార్టీలను మార్చడం కనిపించింది. ఎవరికైతే ఎక్కడ అవకాశాలు కనిపించాయో, వారు ఆ దిశగా అడుగులు వేసిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ , జనసేన, వైసీపీ ఇలా ఏ పార్టీలో చూసినా ఎన్నికల ముందు మార్పులు కనిపిస్తూనే ఉంటాయి.గెలిచిన వారు తమ స్థాయిని పెంచుకోగా, ఓడిన వారు కొత్త అవకాశాల కోసం మళ్లీ రాజకీయ సమీకరణలను పరిశీలిస్తున్నారు.రాబోయే ఎన్నికల నాటికి ఈ మార్పులు మరింత వేగంగా జరుగుతాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో, రాజకీయ నాయకులకు మరింత స్వేచ్ఛ లభించనుంది. ఇది ఒకవైపు పార్టీలకు కూడా అవసరం అవుతుంది. ఎందుకంటే కొత్త సీట్లు పెరిగినప్పుడు సరైన అభ్యర్థులను ఎంపిక చేయడం కీలకం అవుతుంది. అందువల్ల గెలుపు సామర్థ్యం ఉన్న నాయకులను ఆకర్షించేందుకు పార్టీలు కూడా ముందుకు రావాల్సి ఉంటుంది.గత ఎన్నికల సమయంలో టికెట్ల కోసం జరిగిన రాజకీయ మార్పులు అందరికీ గుర్తున్నాయి. చాలామంది నాయకులు తమకు టికెట్ వచ్చే అవకాశాలను బట్టి పార్టీలు మార్చుకున్నారు. మరోవైపు రాజకీయ పార్టీలు కూడా గెలుపు గుర్రాలుగా భావించిన నాయకులను ప్రత్యేకంగా ఆహ్వానించి పార్టీలో చేర్చుకున్నాయి. ఈ విధంగా ఇరువర్గాల మధ్య పరస్పర ఆధారపడే పరిస్థితి ఏర్పడింది.ఇప్పటి పరిస్థితుల్లో ఈ ధోరణి మరింత పెరిగే అవకాశముంది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడతాయి. కొత్త ప్రాంతాలు, కొత్త ఓటరు సమీకరణాలు రావడం వల్ల నాయకులు తమకు అనుకూలంగా ఉండే పార్టీలు లేదా వర్గాలను ఎంచుకునే స్వేచ్ఛ పొందుతారు. దీంతో రాజకీయాల్లో వ్యక్తిగత నిర్ణయాలకు ఎక్కువ ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది.అయితే ఈ స్వేచ్ఛకు మరో కోణం కూడా ఉంది. నాయకులు తరచూ పార్టీలు మారడం వల్ల రాజకీయ స్థిరత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని కొందరు విశ్లేషకులు అంటున్నారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన సమయంలో కూడా ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అప్పట్లో అనేక మంది నాయకులు తమకు అనుకూలంగా పార్టీలను మార్చుకుని రాజకీయంగా కొత్త అవకాశాలను అందిపుచ్చుకున్నారు.ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కొందరు నాయకులు పార్టీ పట్ల నిబద్ధత చూపుతారా లేక వ్యక్తిగత ప్రయోజనాలను ముందుకు పెట్టుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రజల అభిప్రాయం కూడా ఈ విషయంలో కీలకంగా మారే అవకాశం ఉంది. మరోపక్క ఇలా పార్టీలు మారిన వారికి పదవులు కట్టు పెట్టడం వల్ల కొన్ని సంవత్సరాలుగా పార్టీని నమ్ముకున్న వారి మనోభావాలు దెబ్బతింటున్నాయి. మొత్తంగా చూస్తే ప్రస్తుతం ఉన్న రాజకీయ వాతావరణం పవర్ఫుల్ నాయకులకు అనుకూలంగా మారుతోంది. ఈ అవకాశాన్ని వారు ఎలా వినియోగించుకుంటారన్నది రాబోయే రోజుల్లో స్పష్టతకు వస్తుంది. భవిష్యత్తులో రాజకీయ సమీకరణాల్లో మార్పులు తప్పవని సంకేతాలు కనిపిస్తున్నాయి.

## పార్లమెంట్ లో వైసీపీ స్టాండ్ ఏంటీ

**నెల్లూరు, మార్చి 30 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులు ప్రస్తుతం తీవ్ర విభజనతో సాగుతున్నాయి. ఇక్కడ రాజకీయ పార్టీలు ఒకరినొకరు ప్రత్యర్థులుగా కాకుండా శత్రువులుగా చూసుకునే స్థాయికి చేరుకున్నాయని అనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండగా, ప్రజాస్వామ్య సంప్రదాయాలు కూడా చాలా వరకు కనుమరుగయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కనిపించే చర్చా సంస్కృతి, పరస్పర గౌరవం వంటి అంశాలు ఏపీలో కనిపించడం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమరావతి రాజధానికి చట్టబద్ధ హోదా కల్పించాలనే అంశంపై రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించి తీర్మానం ఆమోదించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే అదే సమయంలో శాసన మండలి లో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టకపోవడం రాజకీయంగా చర్చకు దారితీసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దీనిపై విమర్శలు చేస్తూ, ఇది కేవలం రాజకీయ నాటకమని ఆరోపిస్తోంది.రెండు సభలు ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమైన అంశాలను రెండింటిలోనూ చర్చించడం సాధారణ పద్ధతి. కానీ ఈ సందర్భంలో పరిస్థితి భిన్నంగా మారింది. అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ వారు చర్చకు దూరంగా ఉండటం గమనార్హం. మరోవైపు మండలిలో వైసీపీకి బలం ఎక్కువగా ఉండడంతో అక్కడ చర్చ జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిని రాజకీయ వ్యూహంగా చూడాలని కొందరు అభిప్రాయపడుతున్నారు.అయితే ఈ అంశంలో కూటమి ప్రభుత్వం కూడా తన నిర్ణయాన్ని స్పష్టంగా తీసుకుందని అంటున్నారు. అమరావతి విషయంలో రాష్ట్ర శాసనసభ తీర్మానం కేవలం అభిప్రాయాన్ని తెలియజేయడానికే పరిమితమని నిపుణులు చెబుతున్నారు. ఇది చట్టం చేసే ప్రక్రియ కాదని, కేవలం కేంద్రానికి రాష్ట్ర అభిప్రాయం చేరవేయడమే ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేస్తున్నారు.అసలు చట్టబద్ధ ప్రక్రియ మొత్తం పార్లమెంట్ పరిధిలో జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లో మార్పులు చేయాల్సి ఉండటంతో, కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లు ప్రవేశపెడుతుంది. ఆ బిల్లు రెండు సభల్లో ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో గెజిట్ నోటిఫికేషన్ జారీ అవుతుంది. అప్పుడే అమరావతి అధికారికంగా శాశ్వత రాజధానిగా గుర్తింపు పొందుతుంది.ఈ నేపథ్యంలో శాసన మండలిలో తీర్మానం ప్రవేశపెట్టకపోవడం పెద్ద సమస్య కాదని కొందరు రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే కేంద్రం కోరింది రాష్ట్ర అసెంబ్లీ అభిప్రాయం మాత్రమేనని, అది తీర్మానం ద్వారా పంపించబడిందని వారు చెబుతున్నారు. ఇక వైసీపీ ఈ అంశంపై విమర్శలు చేయడం వల్ల రాజకీయంగా వారికి నష్టం జరిగే అవకాశం ఉందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ చర్చలో పాల్గొనకపోవడం ప్రజల్లో ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించవచ్చని అంటున్నారు. మొత్తంగా అమరావతి అంశం చుట్టూ రాజకీయంగా వేడి పెరుగుతుండగా, రాబోయే రోజుల్లో కేంద్ర స్థాయిలో తీసుకునే నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి.

## ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదివాసీ యువకునిపై ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందాలం.అశోక్ బాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకోని బహిరంగ క్షమాపణలు కోరారు. ఎస్టి కులంలో బెంతోరియా సామాజిక వర్గాన్ని చేరుస్తున్నారని వారిని ఎస్టిలుగా పరిగనించవద్దని ఎస్టి వర్గాలు అశోక్ బాబును కలవడానికి వచ్చినప్పుడు ఎస్టి యువకుడు భగవాన్ తనను ఉద్దేశించి అసెంబ్లీలో మాట్లాడానికి నువ్వెవరు! అని ప్రశ్నించటంతో తాను ఆవేశంలో ఆ వ్యాఖ్యలు అతనిపై చేసానే కానీ ఆ సామజికవర్గాన్ని ఉద్దేశించి కాదని అన్నారు. 26వ తారీఖున జరిగిన మొత్తం సంభాషణ వార్తలు వేస్తే బాగున్నని కానీ కొంతమంది ఆ విజువల్స్ ను ఎడిటింగ్ చేసి తాను తప్పుమాట్లాడినట్లు చూపించటం తగదని ఆవేదన వ్యక్తం చేసారు. ఆ రోజు ఆ యువకుడు తరుపున ఆ సామజికవర్గం తనకు క్షమాపణ చెప్పారని అది ప్రజలకు తెలిసేలా చేసుంటే విషయం తారస్థాయికి చేరేది కాదని అన్నారు. వైసీపీ హయాంలో బెంతోరియా కులానికి చేసింది ఏమి లేకపోయిన తన వ్యాఖ్యలను సామజిక మాధ్యమాల్లో పెట్టి తనను బయపెట్టాలని వైసీపీ నాయకులు చూస్తున్నారని ఇటువంటి తాటాకు చప్పుల్లకు భయపడేది లేదని హెచ్చరించారు. తన వ్యాఖ్యలు వలన ఎవరి మనోభావాలు దెబ్బతిన్న తాను బహిరంగ క్షమాపణలు చెబుతున్నానని తెలిపారు.

# రాజధాని మార్పు సాధ్యం కాదా...

**గుంటూరు, మార్చి 30, పెన్ పవర్:**
రాజధానికి చట్టబద్ధత కల్పించేందుకు తీర్మానం చేసింది ఏపీ అసంబ్లీ. కేంద్రం కూడా విభజన చట్టంలో పెట్టేస్తుంది. అంత వరకూ బాగానే ఉంది. కానీ జగన్ సీఎం అయితే రాజధానిని మార్చలేరన్న ప్రచారం మాత్రం అవాస్తవం. మన దేశంలో అమలు చేసినవే చట్టాలు. అమలు చేయకూడదనుకుంటే..దాని కోసం పాలకులు ఎన్నో మార్గాలు వెదుకుతారు. రాజధాని విషయంలో చట్టబద్ధత ఉంటే ఇక మార్పు అసాధ్యం అనుకోవడం అమాయకత్వమే అవుతుంది. వ్యవస్థలను ఎలా వాడుకోవాలో, చట్టాల్లోని లొసుగులను ఎలా వెతకాలో తెలిసిన పాలకులకు ఏదీ అసాధ్యం కాదు.విభజన చట్టంలో అమరావతి పేరు చేర్చినంత మాత్రాన అది శాశ్వతం అయిపోదు. చట్టాలు అనేవి పాలనను క్రమబద్ధం చేయడానికి ఉంటాయి కానీ, పాలకుల పట్టుదలను అడ్డుకోలేవు. గతంలో మూడు రాజధానులు అనే ప్రతిపాదన తెచ్చినప్పుడు, అమరావతిని తీసేస్తున్నామని వారు ఎక్కడా చెప్పలేదు. కానీ, అభివృద్ధిని ఆపేయడం ద్వారా, నిధులను మళ్లించడం ద్వారా ఆ ప్రాంతాన్ని ఒక ఎడారిగా మార్చగలిగారు. అంటే, చట్టాన్ని మార్చకపోయినా, దాని ప్రాధాన్యతను తగ్గించే నిర్వీర్య ప్రక్రియ రాజకీయంగా చాలా సులభం.ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అక్కడే అధికారం ఉంటుందనేది జగన్ చెప్పేమాట. విశాఖలోని రుషికొండపై నిర్మించిన భవనాలు కేవలం గెస్ట్ హౌస్‌లు మాత్రమే కావు, అవి ఒక సమాంతర సచివాలయానికి పునాదులు. చట్టం ప్రకారం రాజధాని అమరావతిలోనే ఉన్నా, క్యాంప్ ఆఫీస్ పేరుతో పాలకుడు విశాఖ నుంచే చక్రం తిప్పవచ్చు. జగన్ అమరావతిని రాజధానిగా కొనసాగిస్తానని ప్రకటన చేసి.. సీఎంకాగానే రాజధాని నిర్మాణానికి అవసరమైన రూ. 50 వేల కోట్ల ప్రాజెక్టును అర్ధాంతరంగా ఆపేయడం, అంతర్జాతీయ సంస్థలైన వరల్డ్ బ్యాంక్ వంటి వాటిని వెనక్కి వెళ్లేలా చేశారు. తర్వాత సీఎం అయినా ఇలా చేయరన్న గ్యారంటీలేదు.రాజధాని అంటే కేవలం భవనాలు కాదు, అది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ. ఐటీ కంపెనీలు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగ అవకాశాలు అన్నీ నమ్మకం మీద ఆధారపడి వస్తాయి. పాలకుడు మారినప్పుడల్లా రాజధాని మారుతుందన్న భయం ఉంటే ఏ పెట్టుబడిదారుడూ ఏపీ వైపు చూడడు. యువతకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే నిలకడైన పాలన, రాజధాని పట్ల స్పష్టమైన విజన్ ఉన్న నాయకత్వం అవసరం. గందరగోళం సృష్టించే ధోరణి ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే, చట్టం ఉన్నా లేకపోయినా అభివృద్ధి కుంటుపడుతుంది.అమరావతిని ఎవరూ మార్చలేరు అనే ధీమా మంచిదే. కానీ మార్చబోము .. అమరావతిని అభివృద్ధి చేస్తామని వైసీపీ ఇప్పటికీ ప్రకటించలేదు. ప్రకటించినా నమ్మే పరిస్థితుల్లో జనం లేరు. రాజ్యాంగబద్ధంగా ఉన్న అధికారాలను



వాడుకుని, వ్యవస్థలను మేనేజ్ చేసి, ఒక ప్రాంతాన్ని పనికిరాకుండా చేసే శక్తి అధికారంలో ఉన్న వారికి ఉంటుంది. ఆ పని గతంలో జగన్ చేశారు. వస్తే మళ్లీ చేస్తారు. రాజధాని మనుగడ అనేది కేవలం చట్టం మీద కాదు, ఆ చట్టాన్ని అమలు చేసే వ్యక్తి ఉద్దేశం మీద ఆధారపడి ఉంటుంది. ఏపీ భవిష్యత్తు నిలవాలంటే, రాజధానిని ఒక సెంటిమెంట్ గా కాకుండా 'కమిట్‌మెంట్' గా భావించే నాయకత్వం కొనసాగాల్సిన అవసరం ఉంది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్చను ప్రారంభిస్తూ గత ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచస్థాయి రాజధానిని నిర్మించాలనే సంకల్పంతో 34 వేల ఎకరాలను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారు. కానీ, జగన్ మోహన్ రెడ్డి కేవలం రాజకీయ కక్షతో రాజధానిని స్మశానంగా మార్చారు అని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానుల ముసుగులో అమరావతిని అనాథను చేశారని, రైతులను రోడ్డున పడేసిన పాపం గత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు చేస్తున్న తీర్మానం అమరావతికి రక్షణ కవచంలా మారుతుందని భరోసా ఇచ్చారు.ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ఘాటుగా స్పందించారు. అమరావతి అనేది కేవలం ఒక కులానికో, ప్రాంతానికో చెందింది కాదు.. అది ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం అని గర్జించారు. జగన్ సర్కార్ రాజధానిని చెరబట్టి రాష్ట్ర భవిష్యత్తును పదేళ్లు వెనక్కి నెట్టేసిందని విమర్శించారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రాకుండా పారిపోయారని, కనీసం తప్పు ఒప్పుకునే ధైర్యం కూడా వారికి లేదని ఎద్దేవా చేశారు. అమరావతిని వెలుగుల జిలుగుల నగరంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు.ఐదేళ్ల పాలనను సైకో పాలన గా నారా లోకేష్ అభివర్ణించారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక గ్రాఫిక్స్‌ది
అంటూ అబద్ధాలు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇన్సైడర్ ట్రేడింగ్ పేరుతో బురదజల్లి, కోర్టుల చుట్టూ తిప్పి కాలయాపన చేశారని దుయ్యబట్టారు. ఇప్పుడు అమరావతికి కేంద్రం నుంచి నిధులు రాబట్టడమే కాకుండా, చట్టబద్ధత కల్పించి ఏ శక్తీ అడ్డుకోలేని విధంగా అభివృద్ధి చేస్తామని లోకేష్ స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో అమరావతి రైతులపై జరిగిన దాడులు, అక్రమ కేసులను అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. బీజేపీ సభ్యుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉందని, విభజన చట్టం సవరణ ద్వారా దీనికి మరింత బలం వస్తుందని పేర్కొన్నారు. విష్ణుకుమార్ రాజు వంటి నేతలు కూడా జగన్ ప్రభుత్వం చేసిన రాజధాని ద్రోహం ను అంకెలు, సాక్ష్యాలతో సహా వివరించారు.ఈ చర్చకు వైసీపీ హాజరుకాకపోవడం ఆ పార్టీకి పెద్ద దెబ్బగా మారింది. కూటమి నేతలు చేసిన తీవ్రమైన ఆరోపణలను తిప్పికొట్టే అవకాశం ఉన్నా, సభను బహిష్కరించడం ద్వారా వైసీపీ తన ఓటమి ని అంగీకరించినట్లయింది. తప్పు ఒప్పుకున్నట్లయింది.

# కడపలో స్టీల్ ప్లాంట్ అడుగులు

**కడప, మార్చి 30 పెన్ పవర్:** ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన జరిగింది. ఇప్పుడు కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె పరిసరాల్లో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి, సుమారు 3 వేల ఎకరాలకు పైగా భూమిని జిందాల్ స్టీల్ ఆంధ్ర లిమిటెడ్ సంస్థకు అప్పగిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దశాబ్దాలుగా రాయలసీమ ప్రజల కలగా ఉన్న ఈ ఉక్కు పరిశ్రమ సాకారం కావడానికి ఈ భూముల బదిలీ ఒక ప్రధాన మలుపుగా భావిస్తున్నారు.గతంలో ఈ ప్రాజెక్టు కోసం వివిధ సంస్థలతో చర్చలు జరిగినప్పటికీ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉక్కు ఉత్పత్తి చేసేందుకు జిందాల్ గ్రూప్ ముందుకు వచ్చింది. ఈ ప్లాంట్ ద్వారా ఏటా దాదాపు 3 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం జిందాల్ సంస్థ సుమారు రూ. 8,883 కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. భూమి అప్పగింత ప్రక్రియ పూర్తి కావడంతో, ఇక ప్లాంట్ నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి.ఈ ప్రాజెక్టు వల్ల రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి ఊపందుకోవడమే కాకుండా, ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా వేల సంఖ్యలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా వెనుకబడిన కడప జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అనుబంధ పరిశ్రమలు కూడా వెలిసే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్ రహదారి సౌకర్యాలను కల్పించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది.భూసేకరణ సమయంలో స్థానిక రైతుల నుంచి వచ్చిన అభ్యర్థనలు, పరిహారం పంపిణీ వంటి అంశాలను ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరించింది. వైసీపీ హాయంలో శంకుస్థాపన జరిగినప్పటికీ.. భూ సమస్యలను పరిష్కరించకపోవడంతో పట్టాలెక్కలేదు. ఇప్పుడు ప్రభుత్వం



అన్నీ పరిష్కరిస్తోంది. జిందాల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఈ ప్రాజెక్టును చేపట్టడం వల్ల నిర్ణీత గడువులోగా నిర్మాణం పూర్తవుతుందని అటు రాజకీయ వర్గాలు, ఇటు పారిశ్రామిక నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ పారిశ్రామిక ముఖచిత్రంలో కడప స్టీల్ ప్లాంట్ ఒక మైలురాయిగా నిలవనుంది.స్టీల్ ప్లాంట్ నిర్మించాలన్నది దశాబ్దాల కల. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలన్నది గత కొన్నేళ్లుగా ఆలోచన. ఎట్టకేలకు అది కార్యరూపం దాల్చబోతోంది. ఈ పరిశ్రమ కోసం సేకరించిన మూడువేల ఎకరాలకు పైగా భూమిని జిందాల్ స్టీల్ ఆంధ్ర పరిశ్రమకు బదలాయించింది కూటమి ప్రభుత్వం. అందుకు సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. దశాబ్దాల కల నెరవేరే రోజు ఆసన్నం అయ్యింది. గతంలో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు చాలా కంపెనీలతో చర్చలు జరిగాయి. అయితే అత్యున్నత ప్రమాణాలతో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి జిందాల్ స్టీల్ ఆంధ్ర కంపెనీ ముందుకు వచ్చింది. ఈ కంపెనీ దాదాపు మూడు మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. జిందాల్ స్టీల్ ఆంధ్ర కంపెనీ సుమారు రూ.8,883 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం విశేషం. ప్రధానమైన భూ బదలాయింపు జరగడంతో మిగిలిన పనులు మొదలు పెట్టనుంది జిందాల్వెనుకబడిన జిల్లాగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. శంకుస్థాపన కూడా చేసింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పరిహారం పంపిణీ పూర్తి అయ్యింది. మరోవైపు ప్లాంట్ కు అవసరమైన మౌలిక వసతుల కల్పన పై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. రహదారులతోపాటు తాగునీరు అందించాలని నిర్ణయించింది. మొత్తానికి అయితే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఒక ముందడుగు పడినట్లు అయ్యింది.

## ధోనీ లేకుండానే బరిలోకి చెన్నై.. RR vs CSK మ్యాచ్ పిచ్ రిపోర్ట్, ప్లేయింగ్ XI ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తన తొలి మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్ జట్టుతో గౌహతిలోని బర్సపరా స్టేడియంలో ఆడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు చెన్నైకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. జట్టు సీనియర్ ఆటగాడు ఎంఎస్ ధోనీ గాయంతో తొలి రెండు వారాలు అందుబాటులో ఉండడని ఫ్రాంచైజీ ప్రకటించింది. దీంతో జట్టులో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో సంజు శాంసన్‌పై ప్రత్యేక దృష్టి ఉంది. గతంలో రాజస్థాన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అతడు ఇప్పుడు సీఎస్కేలోకి మారి తొలి మ్యాచ్ ఆడనున్నాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో పాటు సర్ఫరాజ్ ఖాన్, మాథ్యూ షార్ట్, శివం దూబేలు బ్యాటింగ్‌లో కీలక పాత్ర పోషించనున్నారు. అయితే డెవాల్డ్ బ్రెవిస్ లేకపోవడం జట్టుకు పెద్ద లోటు అని చెప్పాలి. ఇక బౌలింగ్‌లో మ్యాట్ హెన్రీ, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్ బాధ్యతలు చేపట్టనున్నారు.

రాజస్థాన్ జట్టు విషయానికి వస్తే, వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ఆరంభం ఇవ్వాలని చూస్తున్నారు. యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, కెప్టెన్ రియాన్ పరాగ్ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. జోఫ్రా ఆర్చర్, ఆడమ్ మిల్నే, రవీంద్ర జడేజా లాంటి బౌలర్లు జట్టుకు అదనపు బలం. గౌహతిలోని బర్సపరా స్టేడియంలోని పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా కాదు.. ఇక్కడ బౌలర్లే ఎక్కువగా ఆధిపత్యం ప్రదర్శిస్తారు. మొదటి ఇన్నింగ్స్ సగటు స్కోరు సుమారు 146 పరుగుల వరకు ఉంటుంది. పెద్ద స్కోర్లు చాలా అరుదుగా నమోదవుతాయి.

**హెడ్ టు హెడ్ రికార్డులు:**
ఈ రెండు జట్లు ఇప్పటివరకు 32 మ్యాచ్‌లు ఆడగా, చెన్నై 16, రాజస్థాన్ 16 మ్యాచ్‌లలో గెలిచి సమానంగా నిలిచాయి. దీంతో ఈ మ్యాచ్ కూడా ఆసక్తికరంగా మారే అవకాశం కనిపిస్తుంది. మొత్తానికి ఇరు జట్లలో బలమైన ఆటగాళ్లు ఉండటంతో అభిమానులకు ఆసక్తికర పోరుని అందించే అవకాశం ఉంది.

**పిచ్ రిపోర్ట్:**
గౌహతిలోని బర్సపరా స్టేడియంలో పిచ్ ఫ్లాట్‌గా ఉండే అవకాశం ఉంది. లక్ష్యాన్ని ఛేదించే జట్టు పైచేయి సాధించే ఛాన్స్ కనిపిస్తుంది. వికెట్‌పై కొంత గడ్డి ఉన్నప్పటికీ, అది కేవలం ఉపరితలాన్ని పట్టుగా ఉంచడానికే మాత్రమే.. మంచు ప్రభావం వలన వేగవంతమైన అవుట్‌ఫీల్డ్ స్పిన్నర్లకు సమస్యగా మారనుంది.

**RR vs CSK ప్లేయింగ్ XI:**
రాజస్థాన్ రాయల్స్: యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (కెప్టెన్), షిమ్రోన్ హెట్మెయర్, ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, దసున్ షనక, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్, ఆడమ్ మిల్నే.

**ఇంపాక్ట్ ప్లేయర్ : అమన్ రావు**

చెన్నై సూపర్ కింగ్స్: సంజు శాంసన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఆయుష్ మాత్రే, సర్ఫరాజ్ ఖాన్, శివమ్ దూబే, ప్రశాంత్ వీర్, జామీ ఓవర్టన్, అన్షుల్ కాంబోజ్, రాహుల్ చాహర్, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్.

ఇంపాక్ట్ ప్లేయర్ : కార్తిక్ శర్మ

## రోహిత్ 2.0 రెడీ.. ప్రత్యర్థి జాగ్రత్తగా ఉండాల్సిందే!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ని రోహిత్ శర్మ సూపర్ స్టార్ట్ చేశాడు. 200ం స్ట్రైక్ రేట్ తో హాఫ్ సెంచరీ చేసిన అతడిపై సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి. కేవలం 38 బంతుల్లోనే 78 రన్స్ చేసిన ముంబై జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ఐపీఎల్ లోని మిగతా టీమ్స్ కి హెచ్చరించాడు. రోహిత్ 2.0 రెడీ అయింది.. ప్రత్యర్థి జట్లు జాగ్రత్తగా ఉండాలని సూచనలు జారీ చేశాడు. కోల్‌కతాపై రోహిత్ శర్మ ఆటను చూసిన తర్వాత ఒకటే చెబుదామని ఉందా అని అనిల్ కుంబ్లే పేర్కొన్నారు. మైదానంలో అతడు బంతిని ఎదుర్కొన్న తీరును చూస్తే ప్రత్యర్థికి హెచ్చరికలు పంపినట్లుగా అనిపిస్తోంది.. అత్యుత్తమ ఫామ్ లో ఉన్నప్పటి రోజులను మళ్లీ గుర్తు చేసేశాడు. వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, ముజరబాని లాంటి బౌలింగ్ లో ఈజీగా సిక్సులు కొట్టేశాడు. స్వల్ప విరామం తర్వాత స్టేడియంలోకి ఎంట్రీ ఇచ్చిన రోహిత్.. లయను అందుకోవడానికి కనీసం ఐదారు రోజుల సమయం పడుతుంది. కానీ, రోహిత్ పై ఆ ప్రభావం ఏమీ కనిపించలేదని కుంబ్లే వెల్లడించారు. కోల్‌కతా నైట్‌రైడర్స్ బౌలింగ్ లో వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ కీలకం.. కానీ, నరైన్ తన నాలుగు ఓవర్ల కోటా కూడా పూర్తి చేయలేకపోయడం అందర్ని షాక్ కి గురి చేసింది. రోహిత్-- ర్యాన్ -రికెల్టన్ దెబ్బకి పవర్ ప్లేలోనే అతడికి బౌలింగ్ ఇవ్వకపోవడం తీవ్ర నిరుత్సాహ పరిచింది. సునీల్ నరైన్ బౌలింగ్ కి వచ్చే సమయానికి జరగాల్సిన పూర్తి నష్టం జరిగిపోయింది. ఇక్కడే కేకేఆర్ తమ విజయావకాశాలను పూర్తిగా దెబ్బ తీసుకుంది. వారి వనరులను కాస్త మెరుగ్గా ఉపయోగించుకోవాలని అనిల్ కుంబ్లే పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్ క్రికెట్ ఫ్యాన్స్‌కి బ్యాడ్‌న్యూస్.. ప్రసార ఒప్పందాన్ని రద్దు చేసిన జియో



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టోర్నమెంట్ వేళ బంగ్లాదేశ్ క్రికెట్ ఫ్యాన్స్ కి షాకిచ్చింది. భారత్ కి చెందిన జియోస్టార్ బంగ్లాలో ఐపీఎల్ ప్రసార ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు వెల్లడించింది. ఐపీఎల్ ప్రసారాలపై గతంలో విధించిన నిషేధంపై పునరాలోచిస్తున్నట్లు అక్కడి సర్కార్ చెప్పిన తర్వాత ఈ పరిణామం జరగడం గమనార్హం. ఈ రద్దు తక్షణమే అమల్లోకి వస్తుందని టీస్పోర్ట్స్ (బంగ్లాదేశ్ బ్రాడ్కాస్టర్)కు జియోస్టార్ రాసిన లేఖ ఆధారంగా ఇంటర్నేషనల్ మీడియా కథనాలు తెలిపాయి. ఒప్పందం ప్రకారం భాగస్వామ్య పక్షం గడువులోగా చెల్లింపులు చేయడంలో ప్రతిసారి ఫెయిల్ కావడమే ఈ నిర్ణయానికి కారణమని సమాచారం. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఉన్న సమయంలో హిందూ మైనార్టీలపై జరిగిన దాడులు జరిగాయి. అలాంటి సమయంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను మినీ వేలంలో కేకేఆర్ రూ.9.20కోట్లకు సొంతం చేసుకోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దాంతో బీసీసీఐ ఆదేశాల మేరకు అతడిని వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతరం బంగ్లాదేశ్ సర్కార్.. తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. బంగ్లాలో కొత్తగా ఏర్పడిన సర్కార్ ఆ నిషేధంపై పునరాలోచిస్తామని సంకేతాలు ఇచ్చేసింది. ఇంతలోనే జియో డీల్ నుంచి బయటకు వచ్చేందుకు రెడీ అయింది. ఇందుకు భాగస్వాముల మధ్య ఉన్న ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని సమాచారం. ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ గా పేరుగాంచిన ఐపీఎల్ ను ఢాకా ఫ్యాన్స్ బాగా ఆదరిస్తారు. తాజా నిర్ణయం వ్యూయర్షిప్, ఫ్యాన్ ఎంగేజ్మెంట్ పై తీవ్ర ప్రభావం చూపించనుంది. కాగా, జియో నిర్ణయంతో ఐపీఎల్ ప్రసారాల కోసం 2027 వరకు టీస్పోర్ట్స్ కి ఉన్న పర్మిషన్స్ రద్దు అయ్యాయి.

## బైకర్ కోసం రోజుకి 32 కి.మీ.. శర్వా డెడికేషన్ కు హ్యాట్సాఫ్!

బైకర్ కోసం శర్వానంద్ చేసిన ట్రాన్స్‌ఫర్మేషన్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచే ఆయన లుక్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే, తాజాగా విడుదలైన ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియో ఈ మార్పు వెనుక ఉన్న కఠినమైన ప్రయాణాన్ని స్పష్టంగా అందరికీ తెలిసేలా చేసింది. ఈ సినిమాలో బైకర్ పాత్రను రియలిస్టిక్‌గా చూపించాలన్న లక్ష్యంతో శర్వా పూర్తిగా తన శరీరాన్ని మలచుకున్నారు. ట్రైనింగ్ లో భాగంగా శర్వా రోజుకు 32 కిలోమీటర్లు పరుగెత్తడం లాంటి ఎక్స్‌ట్రీమ్ కార్డియో వర్కౌట్స్ చేయడమనేది మామూలు విషయం కాదు. క్రమశిక్షణతో చేసిన ఈ ప్రయాణంలో ఆయన 6 నుంచి 8 కిలోల వరకు బరువు తగ్గి, లీన్ మరియు యూత్‌ఫుల్ ఫిజిక్‌ను సాధించారు. ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ కేవలం లుక్ కోసమే కాకుండా, పాత్రకు న్యాయం చేయాలనే పట్టుదలతో జరిగిందిగా కనిపిస్తోంది. అయితే, ఈ మార్పు వెనుక ఉన్న అసలు కారణం డెడికేషన్‌దే. కఠినమైన వర్కౌట్స్, నిరంతర శ్రమ, మానసిక ఒత్తిడి.. వీటన్నింటినీ ఎదుర్కొంటూ శర్వా తన టార్గెట్ ను సాధించారు. ఈ ప్రయాణాన్ని ఆయన స్వయంగా ఎగ్జాస్టింగ్, పెయిన్‌ఫుల్, రిలెంట్‌లెస్ గా అభివర్ణించడం, ఈ ప్రిపరేషన్ ఎంత తీవ్రంగా సాగిందో చెబుతోంది. ఫిజికల్‌గా మాత్రమే కాదు, మెంటల్‌గా కూడా ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ ఒక పెద్ద ఛాలెంజ్‌గా నిలిచింది. ఫిట్‌నెస్ పరంగా చూస్తే, ఆయన రొటీన్ చాలా కఠినంగా ఉంది. జిమ్‌లో స్ట్రెంగ్త్ ట్రైనింగ్, వెయిట్ లిఫ్టింగ్‌తో పాటూ స్ట్రెచింగ్, బ్రీత్‌వర్క్‌లను కూడా పాటించారు. ముఖ్యంగా యోగా ఆయనకు మానసిక ప్రశాంతత ఇచ్చిన కీలక అంశంగా మారింది. కఠినమైన ట్రైనింగ్ వల్ల వచ్చే మెంటల్ స్ట్రెయిన్‌ను తగ్గించడంలో యోగా ముఖ్య పాత్ర పోషించిందని ఆయన చెప్పడం, ఫిట్‌నెస్‌లో మైండ్- బాడీ బ్యాలెన్స్ ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది. బిహైండ్ ది సీన్స్ యాంగిల్ లో చూస్తే, ఈ ప్రాజెక్ట్ కోసం చేసిన ప్రిపరేషన్ మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియోలో కనిపించిన ట్రైనింగ్ సెషన్స్, బైక్ రైడింగ్ ప్రాక్టీస్ ఇవన్నీ చూస్తుంటే శర్వా ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డారనేది తెలుస్తోంది. సినిమాలో ఉపయోగించే బైక్స్‌ను నడిపేందుకు స్పెషల్ గా ట్రైనింగ్ తీసుకోవడం ద్వారా, ఆయన పాత్రను మరింత సహజంగా తీర్చిదిద్దారు. ఇది కేవలం ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మాత్రమే కాకుండా ఒక యాక్టర్ కమిట్‌మెంట్ కు ఎగ్జాంపుల్ గా నిలుస్తోంది. పట్టుదల, క్రమశిక్షణ ఉంటే అసాధ్యం అనేది ఏదీ లేదని శర్వా చూపించారు. కాగా బైకర్ సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుండగా, ఇప్పటికే ఈ మూవీపై మంచి బజ్ నెలకొంది. మరి శర్వా ఈ సినిమా కోసం పడ్డ కష్టం ఏ మేరకు ఫలిస్తుందనేది చూడాలి.



స్టైలిష్ కో-ఆర్డ్ ఫోటోషూట్‌లో కావ్య థాపర్ గ్లామర్‌ను ప్రసరిస్తుంది





జెన్నీ వెడ్స్ సన్నీ 2ని ప్రమోట్ చేస్తున్నప్పుడు మేధా శంకర్ గ్రీన్ లెహంగాలో స్టన్స్ చేసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com